DEPT. OF INFORMATION & PUBLIC RELATIONS,
GOVT. OF ANDHRA PRADESH, HYDERABAD.
NEWS PAPER RECORDS
FILE COPY
102215

సంపుటం 11 సంచిక 225

రిజిస్టర్ నెం. 46 | స్థాపితం 1925

గోలకొండపత్రిక

11—7—1958 శుక్రవారం | హైదరాబాదు | సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి ఎం. ఏ. | 4 పేజీలు 7 నయాపైసలు

నిమ్నజాతులవారికి 150 వేల యిండ్ల నిర్మాణం

న్యూఢిల్లీ, జులై 10

ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో షెడ్యూల్డుకులాలు ప్రైబ్స్ వారి కొరకు సుమారు 150 వేల యిండ్లు నిర్మించాలని సంకల్పించబడింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలఖర్చుతో నిర్మించబడే గృహనిర్మాణ పథకాలకు రు. 105 కోట్ల ఖర్చవుతుంది. అందు 2.88 కోట్లు షెడ్యూలు ప్రైబ్స్‌కు 5.84 కోట్లు షెడ్యూలు కులాలకు రు 85 లక్షలు మాజీ నేరస్త జాతులకు, రు. 48.7 లక్షలు యితర వెనుకబడిన తరగతులకు కేటాయించబడినవి కేంద్ర పథకాల ఖర్చునంతా భారతప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన వాటిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరిస్తాయి

భూములు కావలెను

ఎర్రగడ్డ, బేగంపేట్, బాలానగర్ బొయినపల్లి సికింద్రాబాద్ మలక్‌పేట మరియు మరే ప్రదేశమునైనా నగరమునకు 4 మైళ్ల లోపల అమ్మకమునకు భూములున్న యెడల ఈ క్రింది అడ్రసుకు తెలుపవలెను.

ఇట్లు
ఎమ్. పరశురామయ్య
1-10 253 బేగంపేట, హైదరాబాద్-(వ)

ఆంధ్ర కాంగ్రెసు వ్యవహారాలపై కేంద్ర పార్లమెంటరీబోర్డు చర్చ

క్రమశిక్షణను ఉల్లంఘించినవారిపై దేవకీనందననారాయణ నివేదికప్రకారం కఠినచర్యలు

కొందరి బహిష్కరణ నాకు సంతోషంగా లేదు

పార్టీనుండి కాంగ్రెస్ వాదుల బహిష్కరణ గూర్చి ముఖ్యమంత్రి ప్రకటన

హైదరాబాదు, జులై 10

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి నేడు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ యీ మధ్య జరిగిన కౌన్సిల్ ఎన్నికలలో కొందరు కాంగ్రెసు వాదులు పార్టీ విప్‌ను ధిక్కరించినందుకు వారిపై చర్య తీసుకొనవలసి వచ్చినందుకు తమ విచారాన్ని వ్యక్తం చేశారు.

పార్టీనుండి సభ్యుల బహిష్కరణ ఎవరికీ సంతోషకరమైన విషయం కాదని అయినా తప్పనిసరి పరిస్థితుల్లో అ విధంగా చేయక తప్పినది కాదని వీరి ప్రవర్తనవల్ల ఇద్దరు కాంగ్రెసు అధికార అభ్యర్థులు ఓడిపోయినారని పార్టీలో క్రమశిక్షణను పరిపోషించుటకు ఇట్టిచర్యలు అవసరమయిన దన్నారు.

మాజీమంత్రులు గౌతు లచ్చన్న, కందుల ఓబుల రెడ్డి గారలనుకేవలం అనుమానంతో సస్పెండు చేయలేదని వారు పార్టీ విప్‌ను ధిక్కరించి [redacted] తాకా అందుకు ఇట్టి పరిస్థితిని ఏ పార్టీగూడా సహింపజాలదన్నారు.

పి. సి. సి. మరియు కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ కార్యవర్గాలు సమష్టిగా నియమించిన ఉపసంఘం అరుగురు సభ్యుల బహిష్కరణకు మరొక పదిమందికి వార్నింగ్ ఇచ్చి వదలివేయుటకు సిఫారసు చేసినదని ఈసిఫారసుల నుకాంగ్రెసులెజిస్లేచర్ పార్టీ అంగీకరించినదని అన్నారు.

కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ కార్యవర్గం అరుగురు సభ్యుల సస్పెండ్ మాత్రమే చేసినది జనరల్ బాడికి మాత్రమే వీనిని బహిష్కరించే అధికారం ఉన్నది. పార్టీ నాయకులు కేవలం వార్నింగు మాత్రమే యివ్వవచ్చును.

లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికలలో ఓటింగ్ నుగూర్చి కొందరిపట్ల విచారణను జరిపించడం తమకు విచారాన్ని కలిగించినదన్నారు ముఖ్యమంత్రి.

కాంగ్రెసులోని భిన్నవాదులు తాము ఒక స్వతంత్ర అభ్యర్థికి ఓటు చేయవలసినదిగా ప్రతిపక్షాలలో కాన్‌వాస్ చేసినట్టు చేసిన ఆరోపణ నిజమా? అని ఒక విలేఖరి ప్రశ్నించగా సాధారణంగా ప్రభుత్వాన్ని బలపరచే ఒక ప్రతిపక్షమగు నేషనలిస్టుపార్టీని ఒక స్వతంత్రునికి ఓటుచేయ వలసినదిగా తాము కోరినమాట నిజమేనని అన్నారు ముఖ్యమంత్రి. క్రమశిక్షణ చర్య తీసుకొనబడిన ఒక కాంగ్రెసు సభ్యుడు కొందరు కాంగ్రెసు వాదులు అధికార అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటుచేసినప్పుడు మీరు ఆ ప్రతిపక్షపు ఓట్లకాంగ్రెసు అభ్యర్థులకు చేయవలసినదిగా ఎందుకు కోరలేదని తమను ప్రశ్నించాడని ముఖ్యమంత్రి తెలుపుతూ ఇది విచిత్రమయిన వాదంగా ఉన్నదన్నారు.

భిన్నవాదుల అభిప్రాయం

రాష్ట్ర కాంగ్రెసులోని భిన్నవాదుల ప్రతినిధి ఒకరు అర్గురు శాసన సభ్యులసస్పెన్షన్ కక్షకూర్చీగెలొన్న [redacted] అని అన్నారు. పార్టీనుండి భిన్న [redacted] తొలగించడానికి ఈ చర్య ద్వారా అధికారపక్షం ప్రయత్నిస్తున్నదని ఆయనన్నారు.

ఐక్య కాంగ్రెసు శాసన సభాపార్టీ కాంగ్రెసు, కృషికార్‌లోక పార్టీ, ప్రజాపార్టీలతో 1955 లో ఏర్పడింది. అప్పటి ఎన్నికలలో కమ్యూనిస్టుల్ని ఓడించాలనే కాంగ్రెసు అధికార వర్గ ఆతృతవలన ఈ ఐక్య పార్టీ ఏర్పడిందని ఆయనన్నారు.

1955 లో ప్రజాస్వామ్య పక్షాల అఖండ విజయం ప్రజలు ఐక్య కాంగ్రెసు ఫ్రంటు అధికారాన్ని వాంఛిస్తున్నారని సూచిస్తున్నది గాని కాంగ్రెసు ఒక్కదానికేకాదు.

పూర్వ లోక్‌పార్టీ సభ్యులు తదితరులతో నున్న భిన్నవాదులవర్గం లో చాలమంది సభ్యులు "వేచి చూద్దాం" అనేవైఖరిని కల్గిఉండగా కొందరు కాంగ్రెసును వీడి కృషికార్ లోక్ పార్టీని పునరుద్ధరించాలంటున్నారు. (యు. పి. ఐ.)

భద్రాచలంలో కుంభవృష్టి

ప్రజా జీవనం స్తంభించిపోయిన వైనం

భద్రాచలం, జులై 10

తూర్పు గోదావరి జిల్లాలోని ఈ యాత్రా కేంద్రంలో విపరీతమైన వర్షాలవలన పట్టణ జీవితం స్తంభించిపోయింది.

నేటి ఉదయంవరకూ గత 24గంటలలోనే 10 సెంటి మీటర్ల వర్షం పడింది. వర్షాకాలం ప్రారంభమైన తరువాత యిప్పటికే 50 సెంటిమీటర్ల వర్షం పడింది.

కిన్నెరసాని నదిలో దిగిన ఒక మధ్య వయస్కురాలైన స్త్రీ కెరటాలకు నిన్న రాత్రి కొట్టుకొని పోయింది.

కిన్నెరసాని కాజ్వే తెగిపోవడం వలన విజయవాడ-బూర్గంపాడు రోడ్డులో రాకపోకలు నిలిచిపోయినవి. గొమ్మూరు-భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్లమధ్య నడిచేబస్‌లు రద్దు చేయబడినవి. భద్రాచలం- వెంకటాపురం, కూనవరంరోడ్డుకుకూడ అవరోధాలేర్పడినవి. (యు.పి.ఐ.)

ఉభయవర్గాలమధ్య ధేబర్ సాధించినసామరస్యం ఎక్కువకాలం నిలవనందుకు ఢిల్లీవర్గాల విచారం

న్యూఢిల్లీ, జులై 10

కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నేటి సాయంత్రం ప్రధాని నెహ్రూ యింట సమావేశమైనప్పుడు దేశంలోని వివిధ ప్రాంతాలలో యిటీవల జరిగిన ఉపఎన్నికలలో కాంగ్రెసుఓటమిని గురించి చర్చ జరిగిందని తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీలో భిన్నవాదుల సంఖ్య పెరగడాన్ని గురించి బోర్డు ముఖ్యంగా పరిశీలించినది. వారు అధికార కాంగ్రెసుకు వ్యతిరేకంగా పనిచేయడాన్ని గురించి ఎ. ఐ. సి. సి. పరిశీలకుడు శ్రీ దేవకీనందన నారాయణ నివేదించారు.

శ్రీ నారాయణ యిటీవల కొత్తగా నెలకొల్పబడిన లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికలలో 9 మంది కాంగ్రెసు అభ్యర్థులు ఓటమిని పొందిన ఫలితంగా ఆంధ్ర కాంగ్రెసు వ్యవహారాల్ని పరిశీలించారు.

భిన్నవాదులు అధికార కాంగ్రెసు అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేయడంవలననే వారు ఓడిపోయారని చెప్పబడుతున్నది. కొన్ని సందర్భాలలో ఎదురు తిరిగిన కాంగ్రెసు వాదులు అధికార కాంగ్రెసు అభ్యర్థులతో పోటీచేయడం జరిగింది.

శ్రీ దేవకీ నందన నారాయణ నివేదికపై ఆంధ్ర కాంగ్రెసులోని క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై కాంగ్రెసు క్రమశిక్షణ చర్యా సంఘం కఠిన చర్యల్ని గైకొనడం తథ్యమని తెలుస్తున్నది.

ఆంధ్ర కాంగ్రెసులోని ఉభయ వర్గాలమధ్య కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ధేబర్ యిటీవల సాధించిన సామరస్యం ఎక్కువ కాలం ఉండక, విభేదాలు మరింతగా పెరిగిపోవడం పట్ల ఢిల్లీలోని కాంగ్రెసు వర్గాలు విచారాన్ని వెలిబుచ్చుతున్నవి.

కాంగ్రెసు వర్గాలలో క్రమశిక్షణ విషయమై ఎక్కువశ్రద్ధ వహిస్తున్న కేంద్ర పార్లమెంటరీబోర్డు క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించాలని నిర్ణయించినది. ఈ కారణంగా కొన్నియితర రాష్ట్రాలలో చాలమంది కాంగ్రెసువాదులు కాంగ్రెసు నుండి బహిష్కరించబడినారు (యు.పి.ఐ.)

కుంభవృష్టికి గ్రామమునక

జామ్‌నగర్, జూలై 10

ఇక్కడకు 40 మైళ్ళ దూరంలో గల సలయ గ్రామంలో నిన్న 12 గంటలలో 11 అంగుళాల వర్షం పడింది. ఆ గ్రామంలో ఎడతెగని వర్షాలకు గుండెలోతు నీరున్నది. నీరు ఇండ్లలోనికి వెళ్ళినది. రోడ్లన్నీ కనిపించకుండా పోయినవి, ప్రజలు చాల యిబ్బంది పడుతున్నారు.

రైలు కన్సెషన్లు

న్యూఢిల్లీ, జులై 10

లోగడ వలెనే ఈ ఏడు కూడ జూలై 15 నుండి సెప్టెంబర్ 15 వరకూ 1,2,3 తరగతుల ప్రయాణికులకు అన్ని రైల్వేలలోనూ కన్సెషన్ రిటర్న్ టికెట్లు యివ్వబడుతాయి, అనగా సింగిల్ జర్నీ రేటులో ఒకటిన్నర రేటుతో రాకపోకల్ని సాగించవచ్చు. అయితే ఒక దానికొకటి 800 మైళ్ళకంటె ఎక్కువ దూరంగల ప్రదేశాలకే ఈ టికెట్లు జారీచేయబడును.

స్త్రీ విద్యావ్యాప్తికి మార్గాల అన్వేషణ

ఇటీవల తనఅధ్యక్షతలో నియమించబడిన కమిటీ కృషిపై దుర్గాబాయి వివరణ

(మాస్టాఫ్ విలేఖరి) హైదరాబాద్, జులై 10

కేంద్ర సాంఘిక సంక్షేమబోర్డు అధ్యక్షురాలు శ్రీమతిదుర్గాబాయ్ దేశ్‌ముఖ్ నేటి ఉదయం పత్రికాప్రతినిధుల సమావేశములో ముచ్చటిస్తూ ప్రస్తుతం దేశంలో స్త్రీవిద్య యింత తక్కువగా ఉండడానికి గల కారణాలేమిటో తన అధ్యక్షతలో యిటీవల కేంద్ర విద్యాశాఖ నియమించిన స్త్రీ విద్యా జాతీయకమిటీ పరిశీలించి ఆరునెలలలో నివేదికను సమర్పిస్తుందన్నారు.

బాలికలు స్త్రీలలో విద్యావ్యాప్తికి తగు సూచనలను ఆకమిటీ చేయగలదన్నారు, ద్వితీయప్రణాళిక అవసరాలకుగాను అనేకమంది బాలికలకువిద్య గరపవలసిఉన్నదని ఆమె అన్నారు విరృంధ ప్రాథమిక విద్యాపథకం అనుకొన్న ఫలితాల్ని సాధించలేక పోయిందన్నారు.

ప్రణాళికలోని వివిధ విభాగాలకు కావలసిన స్త్రీ ఉద్యోగినులను అంచనా వేయడానికి ప్లానింగ్ కమిషన్ యిటీవల ఒక ఉపసంఘాన్ని ఏర్పాటుచేసిందని ఆమెన్నారు. ఆరోగ్యం, విద్య, పరిశ్రమలు మున్నగు రంగాలలో కావలసిన స్త్రీలు, లభ్యమయ్యే శిక్షణ సౌకర్యాల్ని గురించికూడా ఆసంఘం అంచనావేస్తుంది.

స్త్రీ విద్యా జాతీయ కమిటీ పని విషయమై దేశవ్యాపిత పర్యటన జరుపుతున్న శ్రీమతి దుర్గాబాయి దేశంలోని వివిధ ప్రాంతాలలో ముఖ్యంగా ప్రాథమిక, సెకండరీ దశలలో స్త్రీ విద్య ఎలా ఉన్నదో స్వయంగా పరిశీలించగోరుతున్నానని అన్నారు.

స్త్రీలలో- ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో విద్యావ్యాప్తికి అనేక అవరోధాలున్నవని ఆమె అన్నారు. తలితండ్రుల దారిద్ర్యం, విద్యాప్రాముఖ్యం తెలియకపోవడం, బాల్య వివాహాలు మున్నగునవి గ్రామీణ ప్రజల్ని ఎదుర్కొంటున్నవి. ఉపాధ్యాయులను గ్రామాలకు వెళ్ళేటట్లు చూడటం పెద్ద సమస్య, గ్రామాలలోనే శిక్షణ సౌకర్యాల్ని ఖర్చిం చాలి. 14 నుండి 17 సంవత్సరాల వయస్సున్న బాలికల సంఖ్య 120 లక్షలుకాగా అందు 8 శాతమే పాఠశాలలలో ఉన్నారు. గ్రామాలకు పంపించే ఉపాధ్యాయుల వయస్సు 25 – 40 మధ్య ఉండటం శ్రేయస్కరమన్నారు.

రెండు వరాలమధ్య కొట్లాటలో ముగ్గురి మృతి

హైదరాబాద్, జులై 10

గత సోమవారంనాడు ఇబ్రహీం పట్నం తాలూకా జెవంగి గ్రామంలో ఇరువర్గాలమధ్య జరిగిన కొట్లాటలో ముగ్గురు చనిపోయారు.

చంబాన్ రెడ్డివర్గంవారు సిర్సల్ రెడ్డివర్గంవారిపై చిన్నమ్మ యింటి కంపునుండి రాళ్ళు రువ్వారట, ఉభయ వర్గాలవారూ రాళ్ళురువ్వుకోవడం అయిన తరువాత సిర్సల్ రెడ్డి వర్గంవారు కొందరు చిన్నమ్మ యింటిలో ప్రవేశించి అందున్నవారిని కొట్టారు. చంబాన్‌రెడ్డి, సంగారెడ్డి, లక్ష్మణప్ప అదవులకు పారిపోయారు. అయినా మల్లప్ప,అంతారెడ్డి, సాయిగాజు తదితులు వెళ్ళి వారిని హత్య చేశారు.

పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు. (ఎ.ఎన్.ఎస్.)

కార్మికునికి రు. 75 కనీస వేతనం

ఉండాలని హనుమంతరావు కమిటీ సిఫార్సు: నివేదికపై అసంపూర్ణంగా మంత్రివర్గం పరిశీలన

హైదరాబాద్, జులై 10

నేటి ఉదయం సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ప్రభుత్వ, ప్రయివేటుపారిశ్రామిక, వాణిజ్య సంస్థల కార్మికుల వేతనాల వ్యవస్థపునః పరిశీలన విషయమై హనుమంతరావు కమిటి నివేదించిన అంశాలను అసంపూర్ణంగా పరిశీలించినది.

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ఆతరువాత విలేఖరులతో ముచ్చటిస్తూ ప్రభుత్వం త్వరలోనే అంతిమ నిర్ణయాన్ని గైకొనగలదనీ, జులై 15 న తిరిగి మంత్రివర్గం సమావేశమైనప్పుడు ఈసమస్య పరిశీలనకు వస్తుందనీ అన్నారు.

ఒక కార్మికునికి అధమం 75రూపాయల జీతం (అలవెన్సులతో సహా) ఉండాలని ఈకమిటి సిఫార్సుచేసినట్లు తెలుస్తున్నది.

ఈనివేదికపై ప్రభుత్వం నిర్ణయం గైకొనడంలో జాప్యంవలన కార్మిక వర్గాలలో అసంతృప్తి పెరిగిందని ఆయన అంగీకరించారు.

ఈనివేదిక ఉత్పత్తికి సంబంధంలేని వాటర్ వర్క్సు తోటమాలీలతో సహా అన్నిరకాల పనివారిని సమానంగా పరిగణించినందువలన కొన్ని చిక్కుసమస్యలేర్పడినవని ముఖ్యమంత్రి అన్నారు.

ఎన్.జి.ఓ. ల సమస్య

బ్రహ్మానందరెడ్డి కమిటి ఎన్.జి.ఓ. లకు శాశ్వతాలికసహాయాన్ని సిఫార్సు చేయవచ్చాలని ప్రశ్నించగా అది కమిటీ యిష్టానికి విడువబడిందనీ అయితే ఒకటి రెండు మాసాలలో నివేదిక వచ్చే పక్షంలో శాశ్వతాలిక సహాయం సమస్య ఉత్పన్నం కాదనీ ఆయనన్నారు. (యు.పి.ఐ.)

రాష్ట్రపతికి పౌర సన్మానం

జూలై 12 వ తేదీ రాత్రి రేడియో వార్తా నివేదిక

హైదరాబాద్, జులై 10

జూలై 12 వ తేదీన హైదరాబాద్, సికింద్రాబాదు మున్సిపల్ కార్పొరేషన్ల ఆధ్వర్యాన రాష్ట్రపతికి పౌర సన్మానం జరిగే ఉత్సవానికి సంబంధించిన ప్రత్యేక రేడియో వార్తానివేదిక ఆకాశవాణి హైదరాబాదు కేంద్రమునుండి జూలై 12 వ తేదీ రాత్రి 8-45 గంటలకు ప్రసారం చేయబడుతుంది.

ప్రభుత్వ ఆయుర్వేద ఔషధశాల

హిమాయత్ నగర్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద ఔషధశాల చిక్కడపల్లిలోని నెం. 1-8-33 రు. యింటిలోనికి మార్చబడింది.

మంత్రుల పర్యటన

హోంశాఖా మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి జూలై 11 వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు కారులో బైలు దేరి మహబూబునగర్ వెళ్ళి, తిరిగి రాత్రి 7 గంటలకు హైద్రాబాదు చేరుకుంటారు.

వ్యవసాయశాఖా మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి లోగడ, ప్రకటించినట్లు బెంగుళూరులోకాక మైసూరులో జూలై 14 నుండి 16 వ తేదీ వరకు జరిగే రాష్ట్ర మత్స్యసంపద మహాసభకు హాజరవుతారు.

చిట్టెలుకతో అమెరికా రాకెట్ ప్రయోగం

కేప్‌కెనెర్ వాల్, జులై 10

చివరి కొనలో ఒక చిట్టెలుక కనుఉంచి అమెరికా గత రాత్రి ఒక రాకెట్‌ను పంపించినది. ఈ రాకెట్ 6,000 మైళ్ళదూరం ప్రయాణించగలదని తెలుస్తున్నది.

ఈ రాకెట్ ప్రయోగం విజయవంతమైనదని అమెరికా విమాన దళం ప్రకటించినది. రాకెట్ పొడవు 80 అడుగులు.

ఈ రాకెట్ కొన చెక్కుచెదరకుండా చిట్టెలుకతోసహా దక్షిణఅట్లాంటిక్ సముద్రంలో పడగలదట. ఆచిట్టెలుక పేరు "మియా" ఈ కొనపడిన చోట సముద్రంలో రంగు వేసే ఏర్పాటు జరిగింది. అది కనిపించడానికొక దీపంకూడ ఉంటుంది.

లహేజ్ సుల్తాన్ తొలగింపు

బ్రిటిష్ ప్రభుత్వ నిర్ణయ ప్రకటన

లండన్, జులై 10

లాహేజ్ సుల్తాన్‌ను పదవినుండి తొలగించాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించినట్లు కలోనియల్ సెక్రటరీ లెనాక్స్‌బాయిడ్ నేడు కామన్సు సభలో ప్రకటించారు.

సుల్తాన్ అనేక సంవత్సరాలుగా బ్రిటిష్ ప్రభుత్వంతో స్నేహవిరుద్ధంగా వర్తిస్తున్నందున ఆతనిని ఏడెన్‌నుండి బహిష్కరించాలని కూడ నిర్ణయించబడిందని ఆయనన్నారు.

ఇల్లుకూలి ఇద్దరి దుర్మరణం

సికింద్రాబాద్, జులై 10

ఉభయ నగరాలలో 10 రోజులుగా ఎడతెగని వర్షాలుపడుతున్నవి. సికింద్రాబాద్‌లోని సీతాఫలమండిలో ఒక యిల్లు వర్షాలకుకూలిపోగా గతరాత్రి ఆయింటిలో నిద్రిస్తున్న దంపతులు చనిపోయారు.

పోలీసుల కాల్పులో సంతాల్ స్త్రీ మృతి

మరొకరికి గాయాలు

కలకత్తా, జులై 10

కాళిగంజ్ పోలీస్ స్టేషన్ క్రింద గల బటాసన్ గ్రామంలో ఉద్రిక్తులయిన సంతాల్‌లపై పోలీసులు కాల్పులు జరుపగా ఒక సంతాల్ స్త్రీ మరణించినది. మరి ఒకరికి గాయాలు తగిలినవి.

వీరు 62మణుగులగోధుమను దోచుకొనగా పోలీసులు వీరిని పట్టుకొనుటకు వచ్చారు. దానిపై వారు తిరుగబడినారు. ఈ సందర్భంలో పోలీసులు 15 మందిని అరెస్టుగూడా చేశారు.

చర్చించిన అన్ని సమస్యలపై టిటో - నాసర్ ఏకీభావం

అణుప్రయోగాల్ని వెంటనే నిలిపివేయాలనీ శిఖరాగ్ర సమావేశాన్ని జరపాలనీ విజ్ఞప్తి

బ్రియోని, జులై 10

చర్చించినఅన్ని అంశాలపైనా ఉభయదేశాల అధ్యక్షులు ఏకాభిప్రాయాన్ని కలిగిఉన్నారని నాసర్ టిటోల చర్చల అనంతరం విడుదలచేయబడిన సంయుక్త ప్రకటనలో పేర్కొనబడింది.

1956 జులై బ్రియోని ప్రకటనలోని అభిప్రాయాలన్నీ అనుభవంతో ధృవీకరించబడినవనీ ఐక్య అరబ్ రిపబ్లిక్, యుగోస్లేవియాలు ఈస్నేహభావంతో ప్రపంచ శాంతికి దోహదం చేసినవనీ పేర్కొనబడింది.

యుద్ధం, ప్రపంచంలోని అధిక భాగం రెండు శక్తి కూటములుగా విడిపోవడం, విదేశీ ఆధిపత్యం, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో కొన్ని దేశాల ఔక్యం, ఒత్తిడిప్రయోగం, మరోదేశంపై బలప్రయోగం చేయడం లేక బెదిరించడంపట్ల ఉభయ అధ్యక్షులూ వ్యతిరేకతను ప్రకటించారు.

అణుప్రయోగాల్ని సత్వరం నిలిపివేయాలనే ప్రగాఢవాంఛను ఈ సంయుక్త ప్రకటనలో ఉభయ నాయకులూ వ్యక్తపరిచారు,

ప్రపంచ వివాదాల పరిష్కారానికి, ప్రచ్ఛన్నయుద్ధ నివారణకు శిఖరాగ్ర సమావేశం జరగాలని వారు కోరారు.

శాంతి, భద్రతా, ప్రపంచ సౌభాగ్యాలపై ఐక్యరాజ్య సమితి ప్రముఖ పాత్రను నిర్వహించాలని వారు పేర్కొన్నారు.

పతితస్త్రీల సముద్ధరణ సమస్య

రెండవ ప్రణాళికాంతంలోగా 330 గృహాల స్థాపనకు కేంద్ర సాంఘిక సంక్షేమబోర్డు కృషి

హైదరాబాద్, జులై 10

భారతదేశంలోని 550 జిల్లాలలో జిల్లాఒక్కంటికి ఒకపతిత స్త్రీ గృహాన్నయినా యేర్పరచాలని కేంద్రసాంఘిక సంక్షేమబోర్డు ఉద్దేశిస్తున్నదని అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ ఇక్కడ పేర్కొన్నారు. దేశపు ప్రధాన నగరాలలో 50 భిక్షుకగృహాల స్థాపనగూడ తమలక్ష్యమై ఉన్నదన్నారు.

రెండవ ప్రణాళికాకాలంలోగా ఈ పని పూర్తి చేయబడవలసి ఉన్నది. ఇప్పటివరకే 100 జిల్లా కేంద్ర స్థలాలలో పతితస్త్రీలగృహాలను 26 కేంద్ర గృహాలను ఏర్పరచినటులవివరించారు.

వ్యభిచార నిర్మూలనకు తగు శాసనాల చేసి వానిని కట్టుదిట్టంగా అమలు పరచుచుండటంతో సాంఘికంగా పతనం చెందిన ఈస్త్రీల పునరావాసం ఒక సమస్యగా రూపొందినది. వీరికిప్రత్యామ్నాయవృత్తుల చూపవలసివస్తున్నది వివిధ చేతివృత్తులలో వీరికి ఉపయోగకరమైన శిక్షణ ఇవ్వబడుచున్నది.

వీరికి ఇతరసాధారణస్త్రీలకు వివిధ చేతివృత్తుల నేర్పుటకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖసహకారంతోవివిధబోర్డులు ఏర్పరచబడుచున్నవని తెలిపారు.

ఆరేండ్ల నుండీ శిక్షణ!

బాలికల వ్యభిచారానికి చాల వరకూ వారితల్లులే కారణమని శ్రీమతి దేశ్‌ముఖ్ అన్నారు. ధనార్జనకై ఆరేండ్ల వయస్సునుండీ బాలికలకు పురుషుల్ని ఆకర్షించేందుకు అవసరమైన శిక్షణ యిస్తారు. త్వరితంగా బాలిక పడుపువృత్తికి పనికి వచ్చేటట్లు కృత్రిమ పద్ధతులు ప్రయోగించబడుతున్నవని కూడ ఆమె చెల్లడించారు.

ఆ బాలికల్ని వేరుచేసి రక్షించడం అవసరమన్నారు. అట్టి బాలికల్ని చేరదీసి అసలు విషయం చెప్పగా వారు తల్లుల్ని తిట్టి చదువుకుంటామని చెప్పారని ఆమె అన్నారు. (మా. వి.)

ధ్రువ ప్రాంతాలలో ఆకస్మిక దాడులు

నిరోధానికి తమపథకాన్ని రష్యా ఆమోదించగలదని ఐసెన్‌హోవర్ ఆశాభావం

ఒట్టావా, జులై 10

అమెరికా ప్రెసిడెంట్ ఐసెన్ హోవర్ నిన్న కెనడా పార్లమెంటులో ప్రసంగిస్తూ ఉత్తర ధ్రువ ప్రాంతాలలో ఆకస్మిక దాడుల్ని నిరోధించడానికి పరిశీలన దశాల ఏర్పాటు విషయమై తాను సోవియట్‌తో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్ని ప్రస్తావించి అట్టి విధానం వలన ధ్రువాలలో దాడులభయం పోతుందని సోవియట్ అంగీకరించగలదనే ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

"మనను సవాలు చేసే వారితో రాయబారాలద్వారా శాశ్వత శాంతిని సాధించాలని మేము అంగీకారానికివచ్చాము" అని ఐసెన్ హోవర్ అన్నారు.

నిన్న, నేడు కూడ ఐసెన్ హోవర్, డిక్లైన్ బేకర్‌తో చర్చలు జరిపారు. సాంకేతిక చర్చలలో అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్, కెనడా మంత్రులు నలుగురు పాల్గొన్నారు.

అస్సాంలో భూకంపం

షిల్లాంగ్, జులై 10

షెల్లుకోదగ్గ పరిమాణంలో భూకంపం నేటి ఉదయం 11-59 గంటలకు సంభవించినది. అయితే దాని వలన కలిగిన నష్టాలు యింకా అంచనా వేయబడలేదు. దీని పరిమితి 8.5

అత్యుత్తమమైన
డ్రైక్లీనింగ్.
డార్నింగ్
మరియు డైయింగ్
పైషన్స్
ఎలక్ట్రిక్ డ్రైక్లీనర్స

జాతీయజీవితంలో క్రీడల పాత్ర

డాక్టర్ కె.ఎల్. శ్రీమాలివివరణ

న్యూఢిల్లీ, జులై 10

భారతదేశంలో క్రీడలను, ఆటలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎప్పటివలెనే ఆర్థికంగా సహాయపడుతుందనీ, క్రీడా సంస్థలు స్వయంనిర్ణయాధికారాలతో వ్యవహరించాలని ప్రభుత్వం కోరుతున్నదని, ప్రజాధనం సక్రమంగా వినియోగించబడకపోతే ప్రభుత్వము చూస్తూ కూర్చోదని కేంద్ర విద్యామంత్రి, డాక్టర్ కె. ఎల్. శ్రీ మాలి అంతర్జాతీయ క్రీడల పోటీలలో భారతీయజట్లు ఓటమికి కారణాలను తెలుసుకోడానికి నెలకొల్పబడిన ప్రత్యేక సంఘం సమావేశంలో మాట్లాడుతూ వెల్లడించారు. ఈ ప్రత్యేక సంఘం భారతీయజట్ల అసంతృప్తికర ప్రదర్శనలకు గల కారణాలను విచారించి వాటిని నివారించడానికి తగు సూచనలుచేయగలదు. పాటియాలామహారాజా యీ సంఘానికి అధ్యక్షులు.

ఫజుల్కా సంఘటనలో చనిపోయిన పోలీస్ సబిన స్పెక్టర్

సతీమణికి రు. 5 వేల మంజూరి

అంబాలా, జులై 10

ఫజుల్కా సరిహద్దువద్ద ఇటీవల పాకిస్తానీలచే చంపబడిన పోలీస్ సబిన స్పెక్టర్ విశ్వంబరనాథ్ సతీమణి రేవతి రామన్‌కు పంజాబ్ విద్యా మరియు కార్మికమంత్రి అమర్‌నాథ్ విద్యాలంకార్ రు. 5 వేలు బహూకరించారు.

ఈ సంఘటనలో వీరుకాక ఇంకొక ఆరుగురు కానిస్టేబుల్‌లు చనిపోయి ఉండిరి. వీరి కుటుంబాలకు తలా రు 5 వేల చొప్పున భారత ప్రభుత్వము మంజూరు చేసినది.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునదేమనగా మా తల్లిగారగు మండగొండి వెంకటమ్మగారి పేర హైదరాబాదు జిల్లా మేడిచల్ తాలూకా కుందనపల్లిలోను కృష్ణాజిల్లా నందిగామ తాలూకా వెల్లంకి గ్రామంలోను స్థిరాస్తిగలదు మా తల్లికి మేము ముగ్గురు కుమారులు మరియు నలుగురు కుమార్తెలు గలము. ఆమెకు హక్కుగల పైన చూపబడి ఆస్తిని మాముగ్గురు అన్నదమ్ములకు చెందచేసియున్నది, ప్రస్తుతము ఆమె మనస్తిమితము లేక వయసు మీరియున్నందున కొంత మంది స్వార్థపరులు దురోపధులు చేసి ఆమెచే క్రయవిక్రయములు మరియు కవ్వులు జరిపించుటకు ప్రయత్నించుచున్నట్లు తెలియుచున్నది. కావున ఆ ఆస్తిని ఎవరయిన వ్రాయించుకున్న యెడల చెల్లనేరదు. మోసము చేసి వ్రాయించుకొనే యెడల మేము జరుపుచర్యలకు వారే బాధ్యులు.

ఇట్లు
మండగొండి సీతారామయ్య
సా॥ నారపనేనిపల్లి
మధిర తాలూక
(ఖమ్మంమెట్టు జిల్లా)

గొప్ప వేలం

మాసాజిపేట రైల్వేస్టేషన్ మరియు బస్ స్టాండ్ వద్ద కీ॥శే॥ నవాబ్ మెహినుద్దీన్ గారికి సంబంధించినట్టి జర్మన్ డిజైన్ బంగ్లా 50 ఎకరముల వ్యవసాయ భూమి దానిలో సపోటా, కాజు చెట్లుగలవు అట్టి దానిని 18-7-1958 ఆదివారం ఉ॥ 9-0 గం॥ వేలం వేయబడును.

షేర్ అండ్ కంపెనీ
ప్రాపర్టి అక్షనీర్స్
రిజిస్టర్డు నెం. 188 కోట్లఅలీజా
హైదరాబాద్-(ద)
ప్రొప్రైయిటర్: షేర్ అలీఖాన్.

విళంబి సం॥ ఆషాఢ బ॥ దశమి
రా. 11-32 భరణి. రా. 1-35
ఉ. వ. 9-37 మొ; 11-28 వరకు.
(శాలివాహన శకము: 20-4-1880)
1958 జూలై 11 శుక్రవారము.

నాకోరిక

ప్రపంచమునకు మన దేశము ఒక నూతన మార్గమును చూపవలెనని నా అభిలాష. ఈ సమయమందు ఇది అవసరముగా పరిణమించినది. ద్వేషించేవారిని ప్రేమించి ఉద్యమమును సాగించుట చాల కఠినము. అది నేనెరుగుదును. కాని ఈ కష్టసాధ్యమైన పనిని నెరవేర్చుట మన విధి

—వినోబా

గోలకొండ పత్రిక
ఫోన్. నెం. 3280
1958 జూలై 11
శుక్రవారము

తెలంగాణ ప్రాంతీయ సంఘము

తెలంగాణ ప్రాంతీయ సంఘము యొక్క పని కొంచెము ఆలస్యముగనైనను ప్రారంభమగుటకు ముదావహము. ఈ ప్రాంతీయ సంఘమును (రీజియనల్ కమిటీ) యేర్పాటు చేయుటలోనే కొంత ఆలస్యము జరిగినది. ఇప్పటికి యీ సంఘము యేర్పాటు జరిగి కొన్ని నెలలు గడచినవి. తెలంగాణ అభివృద్ధి కొరకు ఉద్దేశింపబడిన యీ సంఘము తన కర్తవ్యమును చక్కగా నిర్వహించవలసిన అవశ్యకత కలదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము యేర్పాటు నిర్ణయము తీసికొనబడినప్పుడు దానితోపాటు తెలంగాణ ప్రయోజనాల రక్షణ ఉద్దేశముతో ఒక ప్రాంతీయ సంఘమును యేర్పాటు చేయవలెనను నిర్ణయముకూడ తీసికొనబడియుండెను. ఇక్కడి ప్రజలలో ప్రత్యేక తెలంగాణముకావలెనను కోరిక ప్రబలముగా నుండెను. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమునకు బదులుగా, తెలంగాణప్రాంత అభివృద్ధిని దృష్టిలోనుంచుకొని, ఢిల్లీ పెద్దలు తెలంగాణ ప్రాంతీయ సంఘముయొక్క యేర్పాటుకు అవకాశము కలిగించినారు. అందుచేత యీ ప్రాంత అభివృద్ధి కొరకు విధ్యుక్తధర్మమును నిర్వహించవలసిన పవిత్రమైన కర్తవ్యము యీ ప్రాంతీయ సంఘము మీద కలదు. ఈ సంఘ సభ్యులు యీ కర్తవ్యమును గమనించి తమ బాధ్యతలను నెరవేర్చవలసిన అవసరము కలదు.

ఇటువంటి ప్రాంతీయసంఘము పంజాబురాష్ట్రములోకూడ ఒకటి నెలకొల్పబడినది. పంజాబులోని ప్రాంతీయ సంఘము మిక్కిలి సమర్థవంతముగా పనిజేయుచున్నట్లు తెలియుచున్నది. తెలంగాణ ప్రాంతీయ సంఘము పంజాబులోని ప్రాంతీయసంఘము యొక్క కార్యకలాపాలను, కార్యవిధానాలను గమనించి పురోగమించుట అవసరము. నిజానికి తెలంగాణ ప్రాంతీయ సంఘమునకు ఒక చిన్న శాసనసభయొక్క స్థితి మరియు అధికారము కలవు. భారత ప్రభుత్వ ఆమోద ముద్ర ఇందుకుకలదు. అందుచేత తెలంగాణ ప్రాంతీయ సంఘము తన యేర్పాటు యే ఆశయాలకొరకు, యే ఉద్దేశాలకొరకుజరిగినవో ఆ ఆశయాలను, ఆ ఉద్దేశాలను నెరవేర్చుటకు కావలసిన కార్యక్రమాలను, విధానాలను నిర్ణయించుకొని ముందడుగు వేయవలసియున్నది. తెలంగాణ ప్రాంత ప్రయోజనాలను చక్కగా కాపాడి, యీ ప్రాంత సర్వతోముఖాభ్యుదయమునకు సమర్థవంతమైన కృషి గావించవలసిన బాధ్యత తెలంగాణ ప్రాంతీయ సంఘముమీద కలదని మరొకమారు జ్ఞప్తిచేయుచున్నాము.

తెలంగాణ ప్రాంతీయసంఘానికి, నిర్ణీతమైన అంశాలలో ఒక శాసనసభకు ఉండవలసిన హోదా కలదు. ఈ హోదాను తగ్గించి, దీనిని ఒక వాదవేదికగా (డిబేటింగ్ సొసైటీగా) మార్చుటకు కొన్ని ప్రయత్నాలు జరుగుచున్నవని తెలుసుకొనుటకు మిక్కిలి విచారించుచున్నాము. ఈ విధముగా ప్రాంతీయ సంఘము యొక్క హోదానుతగ్గించి, దీని ప్రాధాన్యతను తక్కువజేయు ప్రయత్నాలకు తెలంగాణ మంత్రుల ప్రత్యక్షసహకారముకలదనియు, తెలంగాణ మంత్రుల వైఖరి ప్రాంతీయ సంఘ అధికారాలను తగ్గించి, దీని విలువను తక్కువజేయుటకు ఉపయోగపడుచున్నదను వార్తలు వ్యాపించియున్నవి. ఈ వార్తలవలన తెలంగాణలో తీవ్ర అసంతృప్తి మరియు అలజడి కలుగుచున్నవి. తెలంగాణ ప్రాంతీయ సంఘము యొక్క అధికారాలను, ప్రాధాన్యతను తగ్గించు ప్రయత్నాలు దుస్సహమైనవి. ప్రాంతీయసంఘ సభ్యులు పరిస్థితిని గమనించి, విధ్యుక్తధర్మమును ప్రజల శ్రేయస్సుకు అనుగుణముగా నిర్వహించగలరని ఆశించుచున్నాము.

అంబాలా కంటోన్మెంటు బోర్డు

జనసంఘం పైచేయి

అంబాలా, జులై 10

స్థానిక కంటోన్మెంటుబోర్డుకు సత్యవ్రత మరియు కిశోరిలాల్ (ప్రస్తుత సభ్యుడు) ఎన్నుకోబడినారు.

ఇప్పటివరకు ఫలితాలు ప్రకటింపబడిన ఏడింట ఆరుస్థానాలనుజనసంఘం గెలుచుకున్నది.

ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి విస్తరణ అవకాశం

రాష్ట్ర ఎగువసభకు గూడా తామే నాయకునిగా వ్యవహరించగలమని ముఖ్యమంత్రి

ఆంధ్ర తెలంగాణానుండిఇద్దరు మంత్రులుతీసుకొనబడగలరా?

హైదరాబాద్, జులై 10

తాము మంత్రివర్గాన్ని విస్తరించతుది నిర్ణయాన్ని తీసుకొనేముందు వచ్చేఆగస్టునెలలో కాంగ్రెస్ హైకమాండ్‌తో సంప్రదించనున్నటుల రాష్ట్రముఖ్యమంత్రి ఎన్.సంజీవరెడ్డి నేడుపత్రికా ప్రతినిధులకు తెలిపారు.

రాష్ట్ర ఎగువ సభ నిర్మాణం దృష్ట్యా మంత్రి మండలి విస్తరణ అవసరమని భావించబడుచున్నది. ఇప్పటి మంత్రి మండలి సభ్యుల సంఖ్య 13.

శ్రీ సంజీవరెడ్డి తాము ఎంతమంది మంత్రుల నియమింపబోయేది తెలుపలేదు. కాని ఇద్దరు తీసుకొనబడటం ఖాయమని ఒకరు ఆంధ్ర నుండి, మరొకరు తెలంగాణానుండిఅని తెలుస్తున్నది. ముఖ్యమంత్రితో కలిసి ఆంధ్ర నుండి ఇప్పటి మంత్రివర్గంలో ఎనిమిది మంది మంత్రులు, తెలంగాణావారుఅయిదుగురు ఉన్నారు. ఈ శాతము 8:2 ఉండవలెను. శ్రీ గోపాలరెడ్డి కేంద్రంలోకి తీసుకోబడటంవల్ల ఏర్పడినఖాళీ ఇంకా నింపబడలేదు.

మీ మంత్రివర్గంలోకి మహిళనుతీసుకొంటారా? అని ప్రశ్నించగా మంత్రులు కావడానికి మహిళలు కావడం అనర్హత కాదుకదా అని అన్నారు.

సంజీవరెడ్డి తామే రాష్ట్ర ఎగువ సభ నాయకునిగా వ్యవహరిస్తామన్నారు. తాము ఇంకెవరినీ ఎగువ సభ నాయకునిగా వ్యవహరించుటకు నియమింపలేదని ఇదిగూడా కాంగ్రెస్ హైకమాండ్‌తో జరిపే సంప్రదింపుల్లో అంశం కాగలదని అన్నారు వీరు.

కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఒకడిప్యూటి లీడర్‌ను ఎన్నుకోగలదని ఆతను తెలంగాణా ప్రాంతీయ కమిటి నాయకునిగా వ్యవహరించ గలడని అన్నారు, ఇందుకు అనుగుణంగా పార్టీ నిబంధనావళి సవరింపబడినది. తెలంగాణాప్రాంతీయ కమిటి నాయకునిగా శ్రీరంగారెడ్డి వ్యవహరించగలరు అని తెలిపారు వీరు.

కేంద్రం సంకల్పిస్తున్న రెండవ నౌకానిర్మాణ కేంద్రం

కొచ్చిలో స్థాపింపబడాలని అభ్యర్థన

త్రివేండ్రమ్, జులై 10

భారత ప్రభుత్వం ఏర్పరచదలుస్తున్న రెండవ నౌకానిర్మాణ కేంద్రాన్ని కొచ్చిన్ లో ఏర్పరచాలని కేరళ శాసనసభలో అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా కేంద్రమును కోరినవి.

ఈ తీర్మానాన్ని కాంగ్రెస్, పి. ఎస్. పి, ముస్లింలీగ్‌లు బలపరిచాయి.

గ్రీసులో భారత రాయబారి

నవాబ్ ఆలీయవాల్ జంగ్ బహాదూర్ నియామకం

న్యూఢిల్లీ, జూలై 10

బల్గేరియాలో భారత దౌత్య మంత్రిగానూ, యుగోస్లేవియాలో భారత రాయబారిగానూ పనిచేస్తున్న నవాబ్ ఆలీయ వాల్ జంగ్ బహాదూర్‌ను గ్రీసుకు కూడా భారత రాయబారిగా నియమించడమైనదని విదేశాంగ మంత్రిత్వశాఖ నేడొక అధికార ప్రకటన చేసింది. ఆయన యీ పదవులను ఏకకాలంలో నిర్వహిస్తారని కూడా ఆ ప్రకటనలో ఉంది.

కడప జిల్లాలో లోక సహాయక సేనా శిబిరం

జూలై 20 నుండి ఆగస్టు 18 వరకూ నిర్వహణ

మద్రాసు, జులై 10

525 గురికి ఒక నెలపాటు ఉచిత మిలటరీ శిక్షణ యివ్వడానికి కడప జిల్లా ముద్దనూర్‌లో ఒకటి, ఉత్తర ఆర్కాట్ జిల్లా రాణిపేటలో ఒకటి మొత్తం రెండు లోకసహాయక సేనా శిక్షణశిబిరాలు జూలై 20నుండి ఆగస్టు 18 వరకూ నిర్వహించబడుతాయి.

18 నుండి 40 సంవత్సరాల వయస్సులోని ఆరోగ్యవంతులు యిందు చేరవచ్చు.

శబ్దానికన్నా మూడు రెట్ల వేగం

అమెరికా నిర్మించిన విమానం

వాషింగ్టన్, జులై 10

శబ్దానికన్నా మూడురెట్లవేగంతో వెళ్ళగల కొత్తరకంవిమానాన్ని అమెరికన్‌లు కనిపెట్టారు. దీనిపేరు ఎఫ్-108 అంటే ఈ విమానం గంటకు 2 వేల మైళ్ళ వేగంతో ప్రయాణించగలదు.

మధ్యప్రదేశ్‌లో కలరా ఉధృతం

గత మాసాంతంలో 1786 మరణాలు

భోపాల్, జులై 10

దుర్గ్, బిలాసపూర్ జిల్లాలలో గడచిన మాసపు తుది భాగంలో కలరావల్ల 1786 మంది మరణించారని ఆరోగ్య మంత్రిణి రాణి పద్మావతి తెలిపినది.

కలరా సోకిన కేసులన్నీ ప్రభుత్వ ఆస్పత్రులకు రావడం సాధ్యంకాదు కావున ఇంతకన్నా ఎక్కువసంఖ్యలో మరణించారని అన్నా అతిశయోక్తి కాదన్నారు.

జూన్ ఆఖరువరకు దుర్గులో 944 మందిని బిలాస్‌పూర్‌లో 842 మందిని కలరా వ్యాధి పొట్టబెట్టుకొన్నది. ఇప్పుడు ఈవ్యాధి ఈప్రాంతములందు అదుపులోనికి తేబడినది. దాదాపు పదిలక్షల మందికి రాయపూర్, బిలాస్‌పూర్ దుర్గ జిల్లాలందు కలరాఇనాక్యులేషన్స్ ఇవ్వబడినవి.

ఈజిల్లాలలో గ్రామీణ ప్రాంతములందు మంచినీటి కరువు తీవ్రంగా ఏర్పడుటవల్ల కలరావ్యాధి వ్యాపించినది. దాదాపు అయిదులక్షల తొంబది వేల రూపాయల ఖర్చుతో ట్యాంకర్ల ద్వారా ఈప్రాంతాలకు మంచినీరు సరఫరా చేయబడినది.

ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయులకు వేతనాలు

సక్రమంగా అందని స్థితి

హైదరాబాద్, జులై 10

ఉపాధ్యాయ నియోజక వర్గం నుండి ఎగువ సభకు ఎన్నికయిన శ్రీ డి.వి. సుబ్బశాస్త్రి పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ వామన్ రావును కలసి ఉపాధ్యాయులకు వేతనాలు సరిగా అందుటలేదని కర్నూలు జిల్లా నందికొట్కూరులోని గాంధీ మెమోరియల్ బహుళార్థ సాధక ఉన్నత పాఠశాలలో గడచిన నాల్గు మాసాలనుండి ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వబడలేదని నివేదించారు.

ప్రయివేటు పాఠశాలలందు సకాలానికి ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వబడాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీచేయాలని వీరు కోరారు.

డాక్టర్ వామన్‌రావు వీరుతెలిపిన అంశాలవిని తగుచర్య తీసుకొనుటకు హామీ ఇచ్చారు.

తూర్పుమాండలికసమితి సమావేశం

షిల్లాంగులో యీనెల 26వతేదీన

న్యూఢిల్లీ, జులై 10

ప్రాచ్య మాండలికసమితి తృతీయ సమావేశం యీనెల26వతేదీన షిల్లాంగులో జరుగుతుంది. దేశీయాంగ మంత్రి శ్రీ గోవిందవల్లభ పంత్ యీ సమావేశానికి అధ్యక్షతవహిస్తారు.

ఈసమితిలో సభ్యత్వంగల అస్సాం, బీహారు, ఒరిస్సా, పశ్చిమ బెంగాలు రాష్ట్రాల తరఫున ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులూ త్రిపుర, మణిపూర్ కేంద్ర పాలిత ప్రాంతాల తరఫున వాటి చీఫ్ కమిషనర్లూ యీ సమావేశంలో పాల్గొంటారు. ప్రణాళికా సమితి ప్రతినిధులూ, దేశీయాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధులూ కూడా యీ సమావేశానికి హాజరవుతారు.

తూర్పు మాండలిక సమితి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం నిబంధనల మేరకు ఇతర మాండలిక సమితులతో బాటు 1956 నవంబరు నెలలో అవతరించింది. ఈమండలంవిస్తీర్ణం 2,59,000 చదరపు మైళ్ళు, జనాభా 9 కోట్లు. ఈమండలానికి సాధారణంగా వరదల వల్ల నష్టం సంభవిస్తూ ఉంటుంది. వరద నివారణ చర్యల నిర్వహణకుగాను ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో 60 కోట్ల రూ.లు కేటాయించబడింది.

ఈ మండలంలో పండే ప్రధాన ఆహార పంట వరి— యీ మండలంలో తిండిగింజల పంటల విస్తీర్ణం 5 కోట్ల 20 లక్షల ఎకరాలు. ఈ మండలంలో చెరుకు, జనప నార నగదు పంటలు ప్రధానమైనవి. ఈమండలం ఖనిజ సంపద కూడా ప్రసిద్ధి కెక్కింది.

ఆంధ్రప్రదేశ్ ఉభయ సభలు

వచ్చేనెల సమావేశం

హైదరాబాదు, జూలై 10

ఈనెల 8వ తేదీన వాయిదా పడిన ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఎగువ దిగువ సభలు వచ్చేనెల 4 ఆగస్టులో సమావేశం కాగలవని ముఖ్యమంత్రి నేడు ప్రకటించారు.

ఈ సమావేశంలో యూనివర్సిటీల బిల్లు మరియు భూ సంస్కరణల బిల్లు ప్రాధాన్యంగా చర్చించ బడగలవు.

గ్రామీణ విద్యుదీకరణ పథకాలు

రెండవ ప్రణాళికాకాలంలో రు. 75 కోట్లు ఖర్చు చేయబడగలవు

కొత్తఢిల్లీ, జులై 10

1961 మార్చి నెలాఖరువరకు భారతదేశంలో దాదాపు 10 వేల గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడగలదు. రెండవ ప్రణాళికలో విద్యుచ్ఛక్తి పథకాలకు కేటాయింపబడిన మొత్తం రు. 427 కోట్లు, ఇందు దాదాపు రు. 75 కోట్లు గ్రామీణ విద్యుదీకరణకు ఉపయోగింపబడుతుంది.

కేంద్ర జలవిద్యుచ్ఛక్తి కమిషన్ ఇటీవల ప్రచురించిన పత్రంలో ఈవిషయం వెల్లడి చేయబడినది. గ్రామీణ విద్యుదీకరణకై ఈ కమిషన్ తగు ప్రమాణాల నిర్ణయించినది. ఇందువల్ల విద్యుచ్ఛక్తి సామగ్రిగూడా ఒక క్రమపంథాలో ఉత్పత్తి చేయుటకు దోహదం కాగలదు.

1957 లో బెంగుళూర్‌లో జరిగిన అఖిల భారత విద్యుచ్ఛక్తి ఇంజనీర్ల మహాసభచేసిన సిఫారసులదృష్ట్యా ఈ కమిషన్ తగునిర్ణయాల తీసుకొన్నది. కెనడా సహాయ పథకంక్రింద 25నుండి వంద కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల 249 డీసెల్ పెట్లు సరఫరా చేయబడుతవి భారత దేశానికి. ఇవి పెద్ద పెద్ద గ్రామాలకు అలాట్ చేయబడుతవి.

విజయవాడ పట్టణ యువజన కాంగ్రెసు సమావేశం

విజయవాడ, జులై 10

6-7-58వ తేది, ఉ॥ 9 గంటలకు గాంధీనగర్ రాజాహోటల్ బిల్డింగులో శ్రీవాండ్రాశి పోతన్నగారి అధ్యక్షతను పట్టణ యువజన కాంగ్రెసు సమావేశం జరిగింది.

డాక్టర్, శ్రీమతి కె. అచ్చమాంబ [ఎం. పి], ఆంధ్ర ప్రదేశ్ యువజన కాంగ్రెస్ అర్గనైజర్ శ్రీ కె. రాధాకృష్ణరెడ్డి, శ్రీ యివటూరి కోటేశ్వరరావు మొదలగు ప్రముఖులు కూడా హాజరయారు.

శ్రీమతి అచ్చమాంబగారు ప్రస్తుత పరిస్థితులు వివరిస్తూ యువజన కాంగ్రెసులో యువకులతోబాటు, యువతులనుకూడా విరివిగా చేర్పించి, దేశాభిమానం, కాంగ్రెసునందుభక్తి [illegible] లో గూడా అభివృద్ధి పర[illegible] సూచించారు. 13, 14 తేదీలలో విజయవాడలో ఏర్పాటు చేసిన అఖిల భారత మహిళా సమావేశాలకు యువజన కాంగ్రెసు బాధ్యత వహించాలనీ, శ్రీ జనాభ్యుదయానికి యీ సభలు మిక్కిలి ప్రోత్సాహ మిచ్చేటట్లు కృషిచెయ్యాలనీ తెల్పారు.

శ్రీ కె. రాధాకృష్ణ రెడ్డిగారు ప్రసంగిస్తూ కాంగ్రెసు సంస్థనుండి ప్రజలకు ప్రతినిధులుగా మంత్రి పదవులు నిర్వహిస్తున్నవారు, ప్రతి నియోజక వర్గంలోని ప్రజా సమావేశాలు ఏర్పాటు చేయించి, ప్రజల అవసరాలు గుర్తించి అందు కనుగుణ్యమైన చట్టాలు ప్రవేశపెట్టడం, ప్రజాభిప్రాయానికి ప్రతిబింబా లవుతాయనీ, అప్పుడు ప్రజలకు కాంగ్రెసునందు భక్తిశ్రద్ధలు పెరుగుతాయనీ సలహా ఇచ్చారు.

శ్రీ పిళ్ళా వెంకటరత్న కవిగారు ప్రసంగిస్తూ యువజన కాంగ్రెసు, కాంగ్రెసుకు పుత్రసంబంధమైన వారసత్వపు సంస్థయని అది ఋజువు చేసుకోటానికి కాంగ్రెసులోని శిథిలభాగాలలో యువజన కాంగ్రెసు ప్రముఖపాత్ర తీసుకొని పటిష్ఠం చేయాలని ఉద్బోధించారు.

కార్యదర్శి శ్రీ బుద్ధా రాములుగారు యువజన కాంగ్రెసు కార్యక్రమాన్ని వివరిస్తూ యీక్రింది తీర్మానాలను ప్రవేశపెట్టారు:

(1) ఆగస్టు 15వ స్వాతంత్ర్య దినోత్సవం పట్టణమన్ని ప్రాంతములలో నిర్వహించుటకున్నూ, శివాలయంవద్ద లాతీ చౌకులో వార్షికోత్సవ మహాసభలు 5 రోజులు అతి వైభవంగా జరిపించుటనున్నూ తీర్మానించారు.

(2) యువజన కాంగ్రెసు కొత్త బస్తీలోని అన్ని పేటల్లోవిరివిగావ్యాప్తి చెందటానికి కృషిచేయుటకు గాను శ్రీ యివటూరి కోటేశ్వరరావుగార్ని పర్కింగు ప్రెసిడెంటుగా నియమిస్తూ యీ దిగువ వార్షిక కమిటీ మెంబర్లు ఏర్పాటుచేయడమైనది.

శ్రీంగవరపు జగ్గారావు (యం.సి) బాదరాల నరసింహారావు (కన్వీనర్), పాకనాటి మునుస్వామి, సాతులూరి గురువులు, బక్కాల చంద్రారావు, గట్టి మోహన్ రావు (కన్వీనర్), చెన్న కేశవుల రామచంద్రరావు[కన్వీనర్], యెలకా నాగేశ్వరరావు, తాడికొండ గోపాలం, గొల్లెలతాతయ్య, పిన్నింటి సీతారామయ్య, పుప్పాల నరసయ్య, డాక్టర్ శివరామకృష్ణయ్య గార్లను నియమించడ మైనది.

[8] పట్టణములో వ్యాపారము చేయు కొట్లవద్దకు లారీలను తీసుకొని వచ్చి ఎగుమతి, దిగుమతులు జరుపటం వల్ల ట్రాఫిక్కుకు యిబ్బంది కలుగుటయేగాక, ముఖ్యంగా కార్మికులకు జీవనోపాధికి భంగం కలుగుతుంది. కాబట్టి యీపట్టణంలో ప్రత్యేకంగా ఒకలారీ స్టాండు ఏర్పాటు చేసి అచ్చటనుండే ఎగుమతి, దిగుమతులు నిర్వహించ గలందులకు ప్రభుత్వం వారిని కోరుతూ తీర్మానించడ మయినది.

ఆదిలాబాద్‌లో ప్రత్తి ఇతర పంటలు

పలుతాలూకాలలో చెడిపోయినవని కిసాన్ సభ అధ్యక్షులు

ఆదిలాబాద్, జులై 10

ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ ఉట్నూర్, నిర్మల్, మధోల్ తాలూకాలలో ప్రత్తి మరియు ఇతర వాణిజ్యపంటలు పండలేదని అందువల్ల రైతులు వీనిపై విధించబడిన ప్రత్యేక శిస్తును ఇవ్వలేక పోతున్నారని అధికారులకు ఎన్ని విజ్ఞాపనలు ఈ సందర్భంలో పెట్టుకున్నా లాభం లేక పోతున్నదని జిల్లా కిసాన్ సభ అధ్యక్షులు రామకృష్ణశాస్త్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారుఈతాలూకాలలోవాణిజ్య పంటలపై ప్రత్యేకశిస్తు రెమిషన్ ఇవ్వనిచో గత్యంతరం లేక కిసాన్ సభకు సత్యాగ్రహాన్ని ప్రారంభించవలసి రాగలదని వివరించారు.

'విదేశీద్రవ్యంలోటు'

ఆందోళన అవసరం లేదని

ఉప ఆర్థికమంత్రి ప్రకటన

పాట్నా, జులై 10

భారత దేశంయొక్క స్టర్లింగ్ నిలువలు త్వరత్వరగా తరిగి పోతున్నందున మన విదేశ ద్రవ్య పరిస్థితి క్లిష్టతరమయినా,దీనిని గురించి విపరీతంగా ఆందోళన చెందనవసరం లేదనీ, ఎగుమతులను పెంపొందించి, దిగుమతులమ తగ్గించడానికి చర్యలు తీసు[illegible] తున్నవనీ కేంద్ర[illegible] ఏర్పడిన అవాంతర పరిస్థితినీ[illegible] గం చడానికి విదేశ సహాయం చాలవరకూ తోడ్పడగలదని ప్రభుత్వం గుర్తించినదని, మిత్రులవద్దనుంచి దీర్ఘకాలిక ఋణాల సేకరణకు ప్రయత్నం జరుగుతున్నా స్వయంకృషివల్లనే ఈ సమస్యనుని వారించ గలమని శ్రీ భగత్ చెప్పారు.

తొమ్మిదవ తరగతి స్థాపన

వర్గి, జులై 10

మాధ్యమిక పాఠశాల వర్గి (హైదరాబాదు జిల్లా)లో ప్రధానోపాధ్యాయులుగారు మరియు గౌరవనీయులైన విద్యాశాఖ కమిటీ సభ్యుల సహకారముచే విశాఖములు ప్రోగుచేసి తహసీల్‌దారు, వర్గీద్వారా 7-7-58 ఉదయము 10-30 గం॥కు తొమ్మిదవ తరగతి ప్రారంభోత్సవము జరుపబడెను. ప్రారంభోత్సవములో అహమద్ షరీఫ్ బి.ఎ. యల్.యల్.బి. ఎడ్యుకేషన్ కమిటీ అధ్యక్షుడు మరియు తహసీల్‌దార్ వర్గీగారు విద్యార్థులను సంబోధించిరి.

తరువాత పురపాలక సంఘాధ్యక్షులు శ్రీ లక్ష్మీకాంతరావుగారు మరియు పురప్రముఖులుగూడ పాల్గొనిరి

గత సంవత్సరము హిందూస్థానీ తరగతులలో విద్యార్థులసంఖ్య తక్కువ యుండుటవలన ఆ తరగతులు తొలగించి యుండిరి. కాని ఈ సంవత్సరం హిందుస్థానీ తరగతులు ప్రారంభించబడినవి.

ప్రస్తుతము నాల్గవ మరియు ఏడవ తరగతి హిందుస్థానీ తరగతులు తెరువబడినవి. మిగిలిన తరగతులలో నిర్ణీతమైన సంఖ్యలో విద్యార్థులు వచ్చిన, అవికూడ తెరువబడును. రెండవ తరగతి తెనుగు మొదలుకొని తొమ్మిదవ తరగతి తెలుగువరకు మరియు నాల్గవ, ఏడవ హిందుస్థానీ తరగతులలో సీట్లు గలవు.

గజిటెడ్ ఉద్యోగుల ఇబ్బందులు

రాష్ట్రాల పునర్ నిర్మాణ ఫలితంగా ఏర్పడిన వానిని పరిశీలించుటకు కమిటీ నియామకం

హైదరాబాదు, జులై 10

రాష్ట్రాల పునర్ నిర్మాణ ఫలితంగా రాష్ట్ర గజిటెడ్ ఉద్యోగుల కేడర్ నుండి ఏమైనా విజ్ఞాపనలు వచ్చినావానిని విచారించుటకు భారత ప్రభుత్వం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌మెన్ అధ్యక్షునిగా ఒక కేంద్ర సలహాసమితిని ఏర్పరచినది.

ఇందు సభ్యులుగా పి ఎస్. సబ్బూ, ఎం. పి. కేంద్ర న్యాయమంత్రాంగ కార్యదర్శి కలరు.

ఈ కమిటీ నియామకం మరియు దీని విధులగూర్చి బొంబాయి, ఆంధ్రప్రదేశ్, కేరళ, మైసూరు, మధ్యప్రదేశ్, మద్రాసు, రాజస్థాన్, పంజాబ్ ప్రభుత్వాలకు తెలుపబడినది.

రైల్వే సిబ్బందీ పెన్షను పథకం

న్యూఢిల్లీ, జూలై 10

రైల్వే సిబ్బందీ పెన్షను పథకంలో చేరేదీ లేనిదీ తెలియచేయడానికి గడువుతేదీ యీ సంవత్సరం జూన్ 30 వ తేదీనుంచి డిసెంబరు 31వ తేదీకి పొడుగించడానికి రైల్వే బోర్డు నిర్ణయించినదనీ, రైల్వేబోర్డుకు అట్టి విజ్ఞప్తులు రావడంవల్లనే యీ నిర్ణయం చేయబడినదనీ, గడువును పొడుగించడము యిది రెండవసారి అనీ, యిక ముందు గడువు పొడుగించబడదనీ రైల్వేల మంత్రిత్వ శాఖ (రైల్వే బోర్డు) నేడొకపత్రికాప్రకటన చేసింది ఆ తేదీలోగా రైల్వే సిబ్బందీ తమ అభిప్రాయాలను తెలియజేయకపోయినా, లేక ఆ కలాపాలు పూర్తికాకపోయినా రైల్వే ప్రావిడెంటు ఫండు పథకం నిబంధనలు వారికి వర్తిస్తాయని ఆ ప్రకటనలో పేర్కొనబడింది.

జాతీయ క్రమశిక్షణ పథకం

న్యూఢిల్లీ, జులై 10

విద్యార్థులలో క్రమశిక్షణభావాన్ని పెంపొందించడంలోనూ, వారి నడవడికను రూపొందించడంలోనూ జాతీయ క్రమశిక్షణ పథకం ప్రముఖపాత్ర వహిస్తోందని కేంద్ర కార్మిక, ఉపాధికల్పనశాఖ ఉపమంత్రి, శ్రీ అలీ దాలీ ఇక్కడ మాలవీయ నగర్ లో శిక్షణ పొందుతున్న వందమంది మహిళా బోధకుల సమావేశంలో ప్రసంగిస్తూ పేర్కొన్నారు.

ఈ పథకాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరింప చేయాలనీ, యీ శిక్షణ పొందడంవల్ల బాలబాలికలకు పౌరవిధులు తెలియగలవనీ, బృందభావం, స్వయం సహాయభావం, ఆత్మవిశ్వాసం పెంపొందగలవనీ శ్రీ అలీదాలీ అన్నారు.

ప్రస్తుతం యీ పథకం క్రింద మాలవీయనగర్, ఫరీదాబాద్ కేంద్రాలలో సుమారు రెండువందల మంది బోధకులు శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ నంతరం వారిని వివిధ రాష్ట్రాలకు పంపి, జాతీయ క్రమశిక్షణ పథకాన్ని విస్తృతపరుస్తారు.

విమానప్రమాదం

నారాయణగంజ్ సమీపంలో

కలకత్తా, జులై 10

ఇండియన్ ఎయిర్ లైన్స్ కార్పొరేషన్ డకోటా ఒక



వెంటనే అమ్మకానికి గలవు
జెటా టైప్ రైటర్లు
(కొత్తవి) (కొద్ది రోజులు మాత్రమే వాడినవి)
సరసమైన ధరలు
ఇన్‌స్టిట్యూషన్లకు, ఆఫీసులకు తగినవి
క్రిందివారితో సంప్రతించండి
ది హిందుస్తాన్ కార్పొరేషన్ [హైదరాబాద్] లి.
దోమల్‌గూడా, హైదరాబాద్.
(A. A.) ఫోన్: 2409.

11 వ అద్భుత వారము.
[redacted] వారి
*** హౌరా బ్రిడ్జ ***
నటవర్గము:- అశోక్‌కుమార్ - మధుబాల - కె. ఎన్. సింగ్ -
నిర్మాత-దర్శకుడు :- శక్తి సామంత్. సంగీతం :- ఒ. పి. నయ్యర్.
రాయల్ - హైదరాబాద్.
నేడు 3 ఆటలు:- 9-30, 6-30, 9-30 గం॥
8 వ వారం: తీరందాజ్ - గుల్బర్గా.
నేటి నుండి: ముఖరం - జాల్నా.
(Trupix) జగత్ పిక్చర్స్ రిలీజ్.

8 వ మహత్తర వారము.
నేడే చూడండి
శ్రీరాజరాజేశ్వరి పిక్చర్సు వారి
మహత్తర పౌరాణిక చిత్రం
శ్రీకృష్ణమాయ
(నారద సంసారం)
నాగేశ్వరరావు, రఘురామయ్య, పి.వి. సుబ్బారావు, జమున, మాలతి, సూర్యకళ, సూర్యకాంతం నటించిన
రీగల్ - హైదరాబాద్
నేడు 3 ఆటలు: 3-0, 6-15, 9-30 గం॥
(Trupix) ఫ్రియా రిలీజ్.

అందమైన 6 వ సంయుక్త వారము
సిప్పి ఫిల్మ్స్
12,0' CLOCK
(REVISED) (12 గంటలు)
తారాగణం: గురుదత్, వహీదా రెహమాన్, కళికళ, రహమాన్, టమ్ టమ్, పెలెన్, జానీవాకర్.
అశోక్ & మనోహర్
హైదరాబాద్. సికింద్రాబాద్.
నేడు 3 ఆటలు: 3-30, 6-30, 9-30 గం॥
(Trupix) విజయ విడుదల.

రేడియో

హైదరాబాద్

405.4 మీటర్లు (740 కిలోసై)

శనివారం, జూలై 12

ఉ॥ 6-50 సుప్రభాత్ (క), 7-00 తె-వా, 7-15 టి.వి. విశ్వనాథన్, 7-45 క-వా, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 కర్ణాటక సంగీత పాఠము, 8-45 సుగమ్ సంగీత్ (క), 9-00 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 చిత్రజగత్ (క); 12-50 మ-వా, 1-00 వనితా లోకం (విజయవాడ నుండి కిలే), 1-30 చిత్రసీమ (క), 1-50 తె-వా, 2-00 శాస్త్రీయ సంగీతము (క), 2-10 ఉ-వా, 2-20 వాద్యసంగీత్ (క), 2-30 వాతావరణ సూచన.

సా॥ 4-00 బాలానందం, 4-30 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామసీమ, 7-00 తె-వా, 7-15 గ్రామసీమ, 7-30 పుస్తకసమీక్ష (విజయవాడనుండి కిలే), 7-40 విరామ సంగీతము (క), 7-45 ప్రసంగము (హిందీ), 7-55 విరామ సంగీతము (క), 8-00 ఆంగ్లంలో ప్రసంగము, 8-15 సంస్కృత కార్యక్రమము, 8-30 రేడియో న్యూస్‌రీల్, 8-40 విరామసంగీతము (క), 8-45 గీతావళి (క); 9-00 ఆం-వా, 9-15 ఉ-వా, 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమము (ఢిల్లీనుండి కిలే) 11-00 వాతావరణ సూచన.

విజయవాడ

357.1 మీటర్లు (840 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాతం, 6-35 ప్రసార తరంగిణి, 6-40 భక్తిరంజని (ఎ-క) 7-00 తె-వా, 7-15 పాకాల సావిత్రీదేవి, 7-45 సంగీతశకుణ, 9-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 1-00 వనితావాణి, 1-40 హిం-వా, 1-50 తె-వా, 2-00 బొమ్మరిల్లు, 3-00 వాతావరణ సూచన.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 పుస్తకసమీక్ష జి. శ్రీహరికృష్ణ, 7-40 విరామ వాద్యసంగీతము, 7-50 'రేడియో వార్తాదర్శిని', 8-00 పాకాల సావిత్రీదేవి, 8-30 రేడియో న్యూస్ రీల్, 8-40 సుగమ్ సంగీత్ (ఎ-క), 9-00 ఆం-వా, 9-15 హా స్య వల్లరి "ఆమాటకొస్తే" రచన: ఎమ్.ఎస్. శాస్త్రి, 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం (ఢిల్లీనుండి కిలే), 11-00 వాతావరణ సూచన.

షెడ్యూల్డ్ క్యాస్ట్సు విద్యార్థులకు హాస్టల్

లాలాగూడాలో ఈ నెల 15 నుండి తెరువ నిర్ణయం

సికింద్రాబాద్, జులై 10

తెలంగాణా షెడ్యూల్డు క్యాస్టుల విద్యార్థుల సంక్షేమ కమిటీ ఈ మధ్య జె. పి. కాశీనాథమ్ అధ్యక్షతన సమావేశమై లాలాగూడాలో ఈ నెల 15 నుండి షెడ్యూల్డుక్యాస్టుల విద్యార్థుల హాస్టలును తెరువడానికి నిర్ణయించినది. హరిజనులకు సర్ విలియమ్ జార్జను స్కూలులో సీట్లు రిజర్వేషన్‌ను తగ్గించినందుకు ఈ కమిటి తన ఆక్షేపణను తెలిపినది. హరిజనుల ఇబ్బందుల వివరించుటకు ముఖ్యమంత్రి సాంఘిక సంక్షేమ మంత్రి మరియు డి. పి. ఐ. వద్దకు ఒక ప్రతినిధివర్గాన్ని పంప నిర్ణయించినది

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి

దేశముఖ్ దంపతుల సందర్శన

హైదరాబాద్, జూలై 10

యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ అధ్యక్షులు సి. డి. దేశ్‌ముఖ్ కేంద్ర సాంఘిక సంక్షేమబోర్డు అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గత సోమవారం ఇండియా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజిని దర్శించారు.

"పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో డెలిగేషన్ అండ్ కంట్రోల్" అను అంశముపై శ్రీ దేశ్‌ముఖ్ "భారత దేశములో సాంఘిక సంక్షేమ నిర్వహణ" అనుదానిపై శ్రీమతి దేశ్‌ముఖ్ ప్రసంగించారు.

దొంగనోట్ల తయారీ

పోలీసులచే ముగ్గురి అరెస్టు

రానాఘాట్, జులై 10

ఇక్కడ చునారిపారా ప్రాంతంలో పోలీసులు ఒకఇంటిపై దాడిచేసి దొంగనోట్ల ముద్రణాలయాన్ని పట్టుకొన్నారు. ఇక్కడవారికి నోట్లముద్రణకు అవసరమగు సామగ్రి జ్ఞాకులు మెషినులు దొరికినవి. ఈ ఇంటికి చెందిన ముగ్గురు అరెస్టు చేయబడినారు.

పుట్టకొండలో సంక్షేమ దినోత్సవం

దేవాలయంలో సమష్టి ప్రార్థనలు

కాకినాడ, జులై 9

కాకినాడ తాలూకా పుట్టకొండ గ్రామంలో హరిజన సంక్షేమ దినోత్సవము (వెల్‌ఫేర్ డే) జరిగినది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయములో సమష్టి ప్రార్థనలు జరిగినవి. జిల్లా హరిజన సేవక సంఘ పెద్దలు, ప్రచారకులున్నూ, కాకినాడ డిప్యూటీ కలెక్టరువారి బృందమున్నూ ఈ కార్యక్రమం నడిపించిరి. హాస్టలు బాలికలు ప్రార్థన గీతములు పాడిరి. అర్చకులు తీర్థప్రసాదములిచ్చిరి. పులిహోర, దద్దోజనం, బిస్కట్లు, చక్కిలేకోలనలు అందరికినీ పంచిపెట్టబడినవి. వర్షము కురియుచున్నను ప్రక్కగ్రామంనుంచి వచ్చినవారుసైతం భక్తి శ్రద్ధలతో కార్యక్రమం ముగిసే వరకూ ఉండిపాల్గొనిరి.

దేవాలయ ప్రాంగణంలో జరిగిన సభకు డిప్యూటీ కలెక్టరు శ్రీ జి.వి. నరసింగారావు గారు అధ్యక్షులు. అస్పృశ్యతా నివారణోద్యమమును హృదయ పూర్వకంగా సవర్ణులు బలపరిచి హరిజనులను చెలి కాకుండా చూచిన నాడే దేశసౌభాగ్యమునకు మార్గం సుగమం కాగలదు. హృదయ పరివర్తనలేని గీతాపారాయణ ప్రార్థనలు లాభంలేదు. హరిజనోద్ధరణే ముఖ్యమని భావించి గాంధీజీ ప్రతినబూనిరి. వారి ఆత్మశాంతికై ప్రతి నెలా 30 వ తేదీని దేశమంతటా యీ దినోత్సవం జరుపుతున్నారు. పాంథుక మైత్రికై నిజమయినకృషిచేసి మహాత్ముని యందు నిజమయిన భక్తిని కనబరచాలి అని ఉద్ఘాటించిరి. అదే దేశ కల్యాణానికి మార్గమని హెచ్చరించిరి

తర్వాత శ్రీ శతకోపంగారు వైష్ణవ సిద్ధాంతకర్త శ్రీ రామానుజులు సర్వ సమత్వమునే బోధించిరి. వారు హరిజనోద్ధరణకై సామాన్య ప్రజల ఉద్ధరణకై చాల కృషిచేసిరి అనిరి, ఆ సంప్రదాయమునే వైష్ణవులు ఆచరణలో పెట్టవలెననిరి. అన్ని మతస్థులను హరిజనులతో సహా దైవ ప్రార్థనలకు అవకాశం యివ్వాలని అనిరి. శ్రీ రామానుజులవారి ప్రబోధ ఘట్టములు కొన్ని వివరించిరి.

పిమ్మట శ్రీ మర్లపాటి శాస్త్రిగారు మాట్లాడుతూ హిందూ సంఘములోని దురాచారములను, మూఢవిశ్వాసములను విడచి సదాచారములను పోషించుతూ కాలానుగుణముగా మనం బలపడాలన్నారు. మీ ఆచారాలను మతాన్ని పాడుచెయ్యాలనేది మా సంకల్పం కాదు. మనలో పాతను సవరించుకోకపోతే మన దేశానికి, హిందూమతానికి కలుగుచున్న విపత్తును తెలియజెప్పి అందరికీ సుఖము, న్యాయం అనే సూత్రానికి మిమ్ము ఉత్సాహ పరచడమే మా సంకల్పం. వేలకొలది ఏళ్ళనుంచీ నీచాతినీచంగా చూడబడిన హరిజనులు ప్రహ్లాదభక్తితో రామభజనచేస్తూ హిందూ మతాన్నే అంటిఉన్నారు. వారికి న్యాయంచేసి ఉద్ధరించడం మనకనీస ధర్మమన్నారు. కార్యక్రమం పొడుగునా హరిజన ప్రచారకులు శ్రీ సత్యవాడ వెంకటరత్నం శ్రీ రెడ్డి వెంకటరత్నం గారలుండి నడిపించిరి. వచ్చినవారినందరిని ఆదరించిరి. ఉత్సాహ పరిచిరి. సభికులకు ఉద్యోగులకు అభినందనలు తెలిపిన పిమ్మట జనగణమన గీతంతో సభ ముగిసినది.

ఈ కార్యక్రమం చుట్టు ప్రక్కల గ్రామాలలో మంచి ప్రభావం కలిగించును.

వరకట్న పద్ధతి

దేశంలో నిర్మూలం కానందుకు

శ్రీమతి దుర్గాబాయి విచారం

హైదరాబాద్, జులై 10

కేంద్ర సాంఘిక సంక్షేమబోర్డు అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ పలుశాసనాలు వరకట్ననిషేధానికై చేయబడినప్పటికి దేశంలో ఈ అవగుణం నిర్మూలన కానందుకు విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రజలలో సాంఘిక జాగృతిని కలిగించాలని ఇది కేవలం శాసనాలవల్ల అయ్యేపని కాదన్నారు.

వరుని విద్యాస్థాయినిబట్టి వరకట్నం గూడా పెరుగుచున్నదని ఎక్కువ విద్యవల్ల ఈ అనర్థంగూడా ఎక్కువ అవుతున్నదన్నారు. సాంఘిక కార్యకర్తలు వరకట్న నిషేధానికి ఎక్కువగా కృషిచేయాలన్నారు.

బోత్ తాలూకాలో వాణిజ్యపంటలపై పన్ను

ఆదిలాబాద్, జులై 10

బోత్ తాలూకా కిసాన్ సభ కమిటీ కార్యదర్శి ఒక ప్రకటనలో రైతుల ఆస్తుల జప్తుచేసి వాణిజ్యపంటలపై ప్రత్యేక పన్నును వసూలు చేయుటకు పట్వారీలు తమ ఆశక్తతను వ్యక్తంచేసి రాజీనామాల ఇచ్చారని ఈ శిస్తును చెల్లించేస్థితిలో రైతులు లేనందువల్ల పట్వారీలు అట్టి నిర్ణయాన్ని తీసుకొన్నారని తెలుపుచున్నారు.

భారతీయ భాషలలో ఉచ్చారణలో గల సామ్యం

దేశంలో ఈ మూలనుంచి ఆమూలకు, ఉత్తర దిశనుంచి దక్షిణ దిశకూ, తూర్పునుంచి పడమరకూ ప్రయాణం చేస్తే, మనకు అనేక భాషలు వినిపిస్తాయి ఒకేభాషా ప్రాంతంలో వివిధ మండలాలలో ఉచ్చారణలో భేదాలు కనిపిస్తాయి. అయితే ఆయాభాషల మధ్యగల వ్యత్యాసాలను నిర్దిష్టంగా నిర్ణయించడం కష్టమవుతుంది. వివిధ వర్గాలుగా విభజించబడిన భాషల విషయంలోకూడా వాటివాటి పదజాలాలలోగల సామ్యాలు దృష్ట్యా, వాటిని విడదీయడం కష్టమే అవుతుంది. ఈ సత్యం భారతదేశపు సాంస్కృతిక సమైక్యతను నిరూపిస్తోంది.

ఋగ్వేదకాలంనుంచి నేటివరకూ ఒక భాషకు చెందిన పదాలు మరొక భాషలోకి చేరుతూ ఉండడం జరుగుతూనే ఉంది. అందువల్లనే వివిధ భాషల మధ్య సామాన్య లక్షణాలు విస్తారంగా కనిపిస్తున్నాయి.

సంభాషణకు ఉచ్చారణ ప్రధానం. ఉచ్చారణ ఆయా ప్రాంతాలనుబట్టి, ఆయావ్యక్తులనుబట్టి వేరువేరుగా ఉండడం మనం గమనించే విషయమే. అయితే, సంస్కృత భాషా పదాల ఉచ్చారణను ప్రమాణంగా స్వీకరించి, తదితర భారతీయ భాషలలో ఉచ్చారణకు దానిని గీటు రాయిగా వాడుతున్నారు.

మంత్రాల ఉచ్చారణ పొల్లుపోకుండా ఉండాలనీ, సరియైన పద్ధతిలో మంత్రాలను పఠించాలని భారతదేశంలో క్రీస్తుయుగానికి పూర్వమే గుర్తించబడింది. మంత్రాల ఉచ్చారణ సరిగా లేకపోవడంవల్ల వాటి అర్థం మారిమప్పులు సంభవించిన సందర్భాలను కూడా మనం పురాణాలలో చదువుతున్నాం. సరియైన ఉచ్చారణను బోధించేందుకు "శిక్ష", "ప్రతిసాఖ్య" అనే గ్రంథాలు రచింపబడ్డాయి. ఈ విధంగా సంభాషణల తీరులో మార్పు వస్తున్నకొద్దీ. ఉచ్చారణను ప్రమాణీకరించడానికి కృషి సాగింది. అందుకే, వ్యాకరణ శాస్త్రవేత్తలుకూడా అనేక వ్యాకరణ గ్రంథాలు రచించారు.

ఉచ్చారణ కొద్దిగా భిన్నంగా ఉన్నా, అన్ని భాషలలోనూ ఆయా మాటలలో అచ్చులూ, హల్లులూ చాలావరకూ ఒకటే. వాటిలిపులకూ, అక్షరాలకూ (ఉర్దూ మినహాయిస్తే) ఒకే మూలమని తెలుస్తోంది.

అయితే కొన్ని శబ్దాలూ, అక్షరాలూమాత్రం వివిధభాషా ప్రాంతాలలో వివిధ తీరులలో ఉచ్చరించబడుతున్నాయి. "క్ష" అన్న మాటను ఉదాహరణగా తీసుకోండి.—హిందీ, గుజరాతీ, తెలుగు భాషలు మాట్లాడేవారు దానిని "క్ష"గా పలుకుతారు. అయితే వంగీయులు దానిని "ఖ" అంటారు. జ్ఞానంలో "జ్ఞ" అన్న మాటను "గ్య" అని హిందీవారు, కన్నడిగులూ, "గ్న్య" అని గుజరాతీవారు, "ర్న్య" అని మరాఠీవారు ఉచ్చరిస్తారు, అలాగే "ఋ"ను ఉచ్చరించడంలో కూడా వివిధ భాషీయులలో వ్యత్యాసం కనిపిస్తుంది. తమిళులు "ర"నూ, "ల"నూ అతికష్టం మీదకాని పలకలేదు. వాటిని ఉచ్చరించేటప్పుడు ఆ అక్షరాల ముందు "ఇ" అచ్చును చేర్చి పలుకుతారు. "రామ్" అన్న మాటను "ఇరామ్" అనీ, "లక్ష్మణ్" అన్న మాటను "ఇలక్ష్మణ్" అనీ అంటారు.

ఒక్కొక్కప్పుడు ఉచ్చారణనుబట్టి వాక్యాల అర్థంకూడా మారిపోతుంది. క్రింది ఉదాహరణలు చూడండి:-

తెలుగు:- వచ్చినారు. వచ్చినారూ? తమిళు:- అవన్ వందాన. అవన్ వందేనా? కన్నడం:- వందానూ, వందానే? గుజరాతీ:- తో. అవ్యో ఛేఛే. తో అవ్యో ఛే? హిందీ:- వహ్ ఆయా హై క్యా వహ్ ఆయా హై?

దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం రేడియో, సినిమా, టెలివిజన్‌లు ప్రజల విజ్ఞానాభివృద్ధికీ, వినోదానికీ వినియోగించబడడం వివిధ భాషలలో ఉచ్చారణపద్ధతులు మరింత సన్నిహితమవడానికి దోహదం చేస్తున్నాయి.

- డాక్టర్ విశ్వనాథప్రసాద్.

4 లక్షల పాఠ్య గ్రంథాలు వ్యర్థం

మధ్యప్రదేశ్‌లోని పరిస్థితి

ఆగ్రా, జులై 10

మధ్యభారత్ స్కూళ్ళకై ప్రభుత్వ ఉత్తరువుపై అచ్చుచేయబడిన దాదాపు 4 లక్షల పాఠ్యగ్రంథాలు ఈ విద్యాసంవత్సర ప్రవేశంతో నిరుపయోగమయినవి.

మధ్యప్రదేశ్ పబ్లిషర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్‌ప్రసాద్ అగర్వాల్ యీ విషయాన్ని వెల్లడిస్తూ ప్రభుత్వ విద్యావిధానాన్ని విమర్శించారు. ఈ పాఠ్య గ్రంథాలు మధ్యభారత్ బోర్డుచే ఆమోదింపబడినవనీ తర్వాత రద్దుచేయబడినవనీ అన్నారు.

కావ్యగానము

హైద్రాబాద్, జులై 10

శ్రీ తుమ్మపూడి కోటీశ్వరరావు గారు 1958 సం॥ పు పరీక్షలో ఎం. ఏ. (తెలుగు)లో ఉత్తీర్ణులైనారు. వీరు విద్యార్థి దశలో నుండగనే శ్రీ రాజరాజేశ్వరీ శతకమును 'మా అమ్మ' అను అభిధానముతో రచించిరి. తమ శిష్యుడైన శ్రీ కోటీశ్వరరావుగారి యెడగల వాత్సల్యమున ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనముగారు కావ్యగాన సభను 6-7-1958 సాయంకాలం 6 గంటలకు స్వామి వివేకానంద హైస్కూలులో ఏర్పాటు చేసిరి. ఆ సమయమున శ్రీ కోటీశ్వరరావుగారు తమ శతకమును శ్రావ్యముగా పఠించి సభాసదులను రంజింప జేసిరి. సభకు శ్రీ అదిరాజు వీరభద్రరావుగారధ్యక్షత వహించిరి.

"శ్రీరాజరాజేశ్వరీ" అను మకుటముతో మత్తేభశార్దూల వృత్తముల యందు శతకము విరచించబడినది. శ్రీ విద్యాదేవియగు జగదంబను పెక్కు విధముల కవిగారు స్తుతించివారు. పద్యము లచ్చటచ్చట దీర్ఘ సమాస ఘటితములై యున్నను, భావములు, కవితాధార గణనీయములుగానున్నవి శతక పఠనానంతరము శ్రీ లక్ష్మీరంజనముగారు, డా॥ ది. వేంకటావధానిగారు, శిరోమణి చెలమచెర్ల రంగాచార్యులుగారు, శ్రీ ఖం. బాలేందు శేఖరముగారు బాలకవిని అభినందించుచు, కొన్ని పద్యముల భావములను విమర్శించి, అందలి యుదాత్తతను ప్రశంసించిరి.

శ్రీ లక్ష్మీరంజనముగారు శిష్యవాత్సల్యముతో కవిగారిని వస్త్రాదులతో సత్కరించి, ఆశీర్వదించిరి.

తాగుబోతులచే పోలీసులకు గాయాలు

అనంతపురం, జులై 10

అనంతపురంజిల్లా దిడ్డికొట్టల గ్రామంలో నలుగురు తాగుబోతులు ఇద్దరు పోలీసులపైబడి కొట్టగా వారికి గాయాలు తగిలినవి.

ఈఇద్దరు పోలీసులు రాత్రి గస్తీలో ఉన్నారట. చిన్న అయ్యగాడు, ప్రభుదాస్, ఎర్రగాడు, చిన్నబాసప్ప అను నలుగురు బాగా తాగిన స్థితిలో వీరికి కారసిల్లారు. పోలీసులు వారిని అపదంతో పైబడినారు. అత్యాచారానికి దిగినారు. వీరిలో చిన్నఅయ్యగాడు, ప్రభుదాస్ అనువారలు అరెస్టు చేయబడినారు, మిగతావారు పారిపోయినారు.

పౌరంగాబాదు మునిసిపాలిటీ

పౌరంగాబాద్, జులై 10

సమితి అభ్యర్థిని ఓడించి ద్వారకాదాస్ పటేల్ (కాం) పౌరంగాబాద్ మునిసిపాలిటీ అధ్యక్షునిగా ఎన్నికయినారు. పటేల్‌కు 24 ఓట్ల మెజారిటీ వచ్చినది ఈ ఎన్నికలలో. మునిసిపాల్టీ ఉపాధ్యక్ష పదవి గూడా కాంగ్రెసు అభ్యర్థికే దక్కినది. ఆతనిపేరు హాజీ బొద్దీన్.

మార్కెట్ వివరాలు

గుబ్బా బుచ్చయ్యగారి
వెంకటేశం కమీషన్ ఏజంటు
టెలిఫోన్ నెం. 4941

హైదరాబాదు, జులై 10

120- శేర్లు. వల్లా ఒక్కంటికి

దొడ్డుబియ్యం	56-0-0	58-0-0
నెంబర్లు కొ॥	58-0-0	63-0-0
సాంబర్లు కొ॥	65-0-0	69-0-0
మాకలు	35-0-0	40-0-0
వరంగల్ సాం॥ కొ॥	63-0-0	71-0-0
కందులు పెద్దవి	58-0-0	59-8-0
కందులు చిన్నవి	50-0-0	51-0-0
మినుములు	53-9-0	54-0-0
పెసగలు		47-8-0
తెల్లం	40-0-0	45-0-0
పెసర్లు కొత్తవి	69-0-0	70-0-0
తెల్లజొన్నలు	37-0-0	40-0-0
పచ్చ జొన్నలు		
మిరపకాయలు	165-0-0	190-0-0
నువ్వు		61-0-0
వుల్లిగడ్డ కొ॥	16-0-0	21-0-0
చింతపండు కొ॥	48-0-0	58 0-0
తెల్లనువ్వులు	100-0-0	110-0-0
బోధన్ శక్కర (సం॥18)		107-8-0
పెద్దకందిపప్పు	74-0-0	77-0-0
చిన్నకందిపప్పు	68-0-0	70-0-0
పెసరపప్పు	58-0-0	59-0-0
పెసరపప్పు	88-0-0	95-0-0
మినుపపప్పు	74-0-0	75-0-0
లంకపిండి	56-0-0	57-0-0
ఆముదాలు		64-0-0

12 శేర్ల మణుగు

బెల్లం	7-0-0	7-8-0
తెల్లిగడ్డ	6-0-0	9-0-0
పల్కు సూనె		16-8-0
ఆలుగడ్డలు		7-2-0

ఈప్రకారము యీరోజు అయిన దరలు వ్రాయించినాము. గిట్టిన సరుకులు పంపవచ్చును. తెప్పించుతో వచ్చును.

వనమహోత్సవం

హైద్రాబాద్, జులై 10

నారాయణగూడ బాలికల ఉన్నత పాఠశాలావరణములో ది. 9-7-58 న వనమహోత్సవము జయప్రదముగాజరిగినది— దీనికి మా జీ ప్రధానోపాధ్యాయులు శ్రీ కె- సూర్యనారాయణరావుగారు అధ్యక్షత వహించి వృక్షమును నాటిరి. గౌ॥ కార్యదర్శి శ్రీ మాదిరెడ్డి హనుమంతరావు వాయుడుగారును, ఉపాధ్యాయినీ బృందము, విద్యార్థినులును యిందు పాల్గొనిరి. ప్రధానోపాధ్యాయురాలు శ్రీ మతి కస్తూరీ ప్రసాద్ గారు ప్రారంభోపన్యాసము గావించిరి. ఉపాధ్యాయ సంఘ కార్యదర్శిని శ్రీమతి యస్. శారదాలక్ష్మి గారి వందన సమర్పణంతోను, బాలికల మంగళగీతములతోను కార్యక్రమము పరిసమాప్తి గావింపబడినది.

4 వ సంయుక్త వారము
సాహసోపేతమైన మహత్తర చిత్రము,
నేడే చూచి ఆనందించండి!
జలరుహా వారి
*** రాజనందిని ***

తా॥ అంజలీదేవి, జి. వరలక్ష్మి, క్రిష్ణకుమారి, గిరిజ, రాగిణి, ఎన్. టి. రామారావు, ఆర్. నాగేశ్వరరావు, రేలంగి, గుమ్మడి, రాజనాల, కె. వి. ఎస్. శర్మ, మహంకాళి.
దర్శకత్వం :- వేదాంతం రాఘవయ్య
దీపక్ & రాజేశ్వర్
హైదరాబాదు. నేడు: 2-15, 5-45, 9-30 గం॥
సికింద్రాబాదు. నేడు: 2-30, 6-0, 9-30 గం॥
మరియు రామా టాకీస్ (చౌదరి)- వరంగల్.
(Cima) శ్రీ నేషనల్ ఆర్ట్ పిక్చర్స్ రిలీజ్.

4 వ సంయుక్త వారము
జంటనగరములలోని ప్రేక్షకులు అద్భుతముగా పొగడుచున్న అసమాన వినోద చిత్రము.
ప్రతిభా చిత్రం
దొంగలున్నారు - జాగ్రత్త
(తెలుగు)

నటవర్గము :- * జగ్గయ్య, * జి. వరలక్ష్మి, * గిరిజ, * హేమలత, * గుమ్మడి, * చదలవాడ, * సీతారామ్, * రాజనాల * రమణారెడ్డి, * సి. యస్. ఆర్, * బాలకృష్ణ, * శివరావు.
కమల్ & ప్యారడైజ్
హైదరాబాద్. సికింద్రాబాద్.
నేడు 3 ఆటలు: 3-0, 6-0 మరియు 9-30 గం॥
రాజరాజేశ్వరి- వరంగల్.
(CIMA) పూర్ణా విడుదల.

4 వ సంయుక్త వారము

వినోద ప్రొడక్షన్సు వారి

* మహాదేవి *

నటవర్గము: సావిత్రి, ఎమ్.ఎన్. రాజమ్, ఎమ్.జి. రామచంద్రన్, చంద్రబాబు, వీరప్ప, మాస్టర్ మురళి.
దర్శకత్వం: సుందర్ రావు నడకర్ణి.
సంగీతం: విశ్వనాథ్ రామమూర్తి.
పాటలు & సంభాషణలు: శ్రీశ్రీ.
(రామభక్త హనుమాన్ ఖ్యాతి)

సాగర్ & చిత్రా
హైద్రాబాద్. సికింద్రాబాద్
నేడు శిఆటలు: 2-30, 6-0, 9-30 గం॥

మరియు
మార్కండేయ- రామాటాకీస్ భారత్
వరంగల్. కొత్తగూడెం. కరీంనగర్.
Cima పూర్ణా రిలీజ్.

సిద్దిపేట తాలూకా గ్రామ పంచాయతీల అసోసియేషన్

సిద్దిపేట, జులై 10

తేది 8-7-58 నగలు. 2 గంటలకు సిద్దిపేట, డివిజన్ కార్యాలయములో శ్రీ డిప్యూటీ కలక్టర్ గారి అధ్యక్షతన తాలూకా గ్రామ పంచాయతీల సర్ పంచులు సమావేశమై ఏకగ్రీవముగా ఈదిగువ నుచాహరింపబడిన తాలూకా పంచాయతీల అసోసియేషన్‌ను ఎన్నుకొన్నారు:-అధ్యక్షులు:శ్రీశ్రీరాంరాజయ్య దుబ్బాక. ఉపాధ్యక్షులు : శ్రీ డి. నరసింహారెడ్డి కొండపాక. కార్యదర్శులు : శ్రీ ప్రతాపరెడ్డి పొన్నాల, శ్రీఆర్. కృష్ణమూర్తి దొమ్మాట, కోశాధికారి : శ్రీ గౌరారెడ్డి చినకోడూరు. సభ్యులు : శ్రీ నరసింగరావు మిట్టపల్లి, శ్రీ జి. రామచంద్రం మిట్టదొడ్డి, శ్రీరామచంద్రారెడ్డిచిట్టాపూర్, శ్రీశంకరరావుపుల్లూరు, శ్రీవెంకటగోపాల్ రెడ్డి మర్పడ్గ, శ్రీబాల్ రెడ్డిఅల్లిపూర్. శ్రీ డివిజన్ పంచాయతీ ఇనస్పెక్టర్‌గారు పంచాయతీల సమాఖ్య. కార్యవర్గముయొక్క బాధ్యతలు స్పష్టముగా వివరించిన తదుపరి శ్రీ డిప్యూటీ కలక్టర్ గారి అధ్యక్షోపన్యాసముతో పంచాయతీలు ఏలాటి పార్టీ విభేదాలలో జోక్యము తీసుకొనక తాలూకా అసోసియేషన్ ముందు విజయవంతముగా నడుపగలరని కోరుతూ తాలూకా కమిటీతో సహకరించగలందులకై హామీ ఇచ్చుచూ సభ ముగిసినది-

పబ్లిక్ నల్లావద్ద దౌర్జన్యంచేసిన ముస్లింలకు రూ.12/- జరిమానా

ఇల్లెందు, జులై 10

13 వ నెంబర్ బస్తీలో పబ్లిక్ నల్లా వద్ద అక్రమముగాప్రవర్తించిన,"షేఖు మౌలా" అనువారికి స్థానిక మున్సిఫ్ కోర్టులో రూ. 12/- జరిమానా వేయబడినది. యితను శ్రీ మతి పద్మావతి అను ఆవిడపై అక్రమముగా నీటి కులాయివద్ద ప్రవర్తించుటచేత పోలీసు హారిచే కేసు పెట్టబడింది.

మనుచరిత్రము - ఒక మంచి పాఠాంతరము

హైద్రాబాద్, జులై 10

కె.ఎస్. కోదండ రామయ్య ఇలా తెలుపుతున్నారు:-

ఆర్. వేంకటేశ్వర కంపెనీవారు, మనుచరిత్రమును, శ్రీ బులుసు వేంకట రమణయ్యగారిచే చక్కగ సంస్కరింపజేసి, 1947లో నచ్చువేయించి, ఆంధ్రలోకమున కుపకార మొనర్చినారు. శ్రీ వేంకట రమణయ్యగారు, పెక్కుమంది పండిత ప్రకాండులు మను చరిత్రమును గురించి వ్రాసిన విషయములను గమనించియు, తమకు లభించిన పెక్కువాతప్రతులను పరిశీలించియు, మనుచరిత్రమును గడుచక్కగ పరిష్కరించియున్నారు. అందువలన, మనుచరిత్రలో నిదివరకు సందేహాస్పదములుగనో, విరుద్ధములుగనో నుండిన పెక్కు విషయములకు అర్థములు మరియు సమాధానములు లభించినవి. అయినప్పటికిని, సందేహాస్పదములుగా నుండు సందర్భములు గ్రంథములో నింకను నక్కడక్కడ లేకపోలేదు.

ఆంధ్రరాష్ట్రమందేకాక, ఆంధ్రరాష్ట్ర సరిహద్దు ప్రాంతములందును, దక్షిణాంధ్రమందును వెదకిన యెడల, మనుచరిత్ర తాళపత్రప్రతులు పెక్కుదొరకగలవు. ఆలాగు లభించిన యెడల మను చరిత్రమును మరింత బాగుగ సంస్కరించి, చక్కని మరియు నిర్దుష్టమైన ప్రతిని పాఠకుల కందజేయవచ్చును.

కొన్ని నెలలకుముందు వేవనపల్లి ప్రక్కననుండు "బూదిముట్లు" అను గ్రామవాస్తవ్యులగు శ్రీరామేగౌని వారియింట, శిథిలావస్థయందుండు మనుచరిత్ర తాళపత్ర ప్రతి యొకటి నాకు లభించింది. దీనిని వేంకటేశ్వర కంపెనీవారి ప్రతితో పోల్చిచూడగా, నిది యొక పురాతనమైన ప్రతిగా నున్నట్లు తెలియుటయేగాక, అక్కడక్కడ కొన్ని మంచి పాఠాంతరములుగూడ నగుపడినవి. ఉదాహరణమునకై యొకపాఠాంతరమునిచ్చుట ప్రాయుచున్నాను.

వావిళ్లవారి ప్రతియందును, దానికంటే ముందు ప్రచురింపబడియుండు వేరొక ప్రతియందును, మనుచరిత్రయందలి, ప్రథమాశ్వాసపు 81వ పద్యమిట్లున్నది.

శా॥ గంగా స్వచ్ఛ తరంగ భంగిక యశో—గాఢచ్ఛ విచ్ఛన్నసా। రంగాంకాంక! నిరంకుశ ప్రతికళా— ప్రౌఢి ప్రియం భావుకా। గాంగే యాచల చాపనూపుర వచో- గాంభీర్య లీలాస్పదా। బంగాళాంగ కళింగ భూపసు భటా।భ్రశ్రేణి ఝంఝూనిలా॥

ఈపద్యమందు శ్రీ కృష్ణదేవరాయలు బంగాళా దేశము మరియు అంగదేశములపైదండయాత్రలుసలిపి జయించినట్లు సూచింపబడి యున్నది. కృష్ణరాయ లీరెండుదేశములపై దాడి సలిపినట్లుగాని, జయించినట్లుగానిచారిత్రికాధారములు లేవు. అందువలన పెద్దనగారి యీవర్ణనను పండితులును, చరిత్రకారులును అతిశయోక్తిగా భావించుచూవచ్చారు. అల్లసాని పెద్దనను, అతని మనుచరిత్రమును తీవ్రముగా విమర్శించిన కీ॥శే॥ ఉమర్ అలీషా కవిగారు కొన్నేళ్ళకుముందు ఈలాటి పద్యములను గురించివ్రాస్తూ ఇవి అతిశయోక్తులనియు నిజముగాదనియు వ్రాసినారు. (చూ. ఆంధ్రి భారతి— మే 1926)

బులుసు వేంకటరమణయ్యగారు పరిష్కరించి యుండు ప్రతియందిపద్యము యొక్క కడపటి పాదములో కొంతమార్పు గలదు. అందు "బంగాళాంధ్ర కళింగ భూపసు భటాభ్రశ్రేణి ఝంఝూనిలా" అని యున్నది.'అంగ' శబ్దమునకు బదులుగా 'ఆంధ్ర' శబ్దమున్నది; కాని బంగాళా దేశముపేరు మాత్రమాలాగే నిలచి పోయింది.

ఇటీవల బూదిముట్లలో దొరికిన తాళపత్ర ప్రతి, యీ చరిత్ర విరుద్ధాంశమును దొలగించుటకు దోడ్పడుచున్నది. ఈ ప్రతియందీపద్యము,

శా॥ గంగాస్వచ్ఛతరంగ భంగిక యశో-గాఢచ్ఛవిచ్ఛన్నసా। రంగాంకాంక! నిరంకుశ ప్రతికళా ప్రౌఢిప్రియం భావుకా। గాంగే యాచల చాపనూపురవచో- గాంభీర్యలీలాస్పదా। భంగాలాప కళింగ భూప సు భటాభ్రశ్రేణి ఝంఝూనిలా॥

అని యున్నది. ఈ క్రొత్తప్రతియందలి పాఠము, కృష్ణరాయలు బంగాళాంగ దేశములను జయించెననునట్టి అతిశయోక్తులేవియులేక అర్థవంతముగ నున్నది. ఈ లాగే దీనియందక్కడక్కడ మరికొన్నిమంచిపాఠాంతరములున్నవి. ఈనూతన ప్రతియందలి పాఠాంతరముచితముగా నున్నదని పండితలోకము దలంచు నెడల, రాబోవు ముద్రణమునందీపద్యమును తగురీతిగా సవరించి ముద్రింపవచ్చును.

వెండి, బంగారు ధరలు

హైద్రాబాదు, జులై 10

బంగారం	105-4-0
అశోక చీపులు	105-12-0
సవరను	69-0-0
వెండి తు. 100 కి.	176-0-0
చిల్లర తు. 1 కి.	1-13-0

సికింద్రాబాదుజిల్లా పద్మశాలి ద్వితీయ మహాసభ

సికింద్రాబాద్, జులై 10

ఇటీవల టెంపెడ్ హోలులో జరిగిన పై మహాసభకు శ్రీప్యాపలి రామయ్యగారు అధ్యక్షత వహించిరి. ఆహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీఅడ్లగట్లనరసయ్యగారు మహాసభకు విచ్చేసిన వారందరికి స్వాగతము చెప్పిరి. సంఘము పుట్టు పూర్వోత్తరాలు వివరించుతూ, యువకులు ముందుకువచ్చి సమైక్యతగా కృషిచేయవలసిన కర్తవ్యాన్ని శ్రీ నరసయ్యగారు తమ స్వాగతోపన్యాసములో ఉద్బోధించిరి.

మహాసభను ప్రారంభించుటకు మంత్రి శ్రీ డి సంజీవయ్యగారు రానందున శ్రీ సచ్చిదానందస్వామిగారు ప్రారంభోపన్యాసము గావించిరి. పద్మశాలీయుల ప్రస్తుత పరిస్థితి, వారిలోని సాంఘిక దురాచారాలు,అవిద్య మొదలైన సమస్యలను పరిష్కరించుకోవలసిన అవసరాన్ని గురించి వారు ముఖ్యంగా మాట్లాడిరి.

1958లో జరిగిన ప్రథమ మహాసభ నుండి నేటివరకు సికింద్రాబాదుజిల్లా పద్మశాలి సంఘము యొక్క కార్యకలాపముల నివేదికను, ఆయవ్యయ పట్టికను సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. కె. రాజారాం మహాసభలో చదివి వినిపించిరి. ప్రధానకార్యదర్శి నివేదిక, లెక్కలు ఏకగ్రీవముగా ఆమోదించబడినవి.

తదుపరి ప్రముఖసంఘ సంస్కారకులు శ్రీ శ్యామరావుగారు యాదవ మహాసభ అధ్యక్షులు పోలం వీరయ్యగారు, హరిజన నాయకుడు శ్రీ వి. రామారావు, ఎం.ఎల్.ఏ. గారు సికింద్రాబాదుజిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కె.ఎస్. నారాయణ, ఎం. ఎల్.ఏ గారు మరియు శ్రీ వి. లక్ష్మణాచార్య గారు (ఆర్యసమాజ నాయకులు) మహాసభ జయప్రదము కావలెనని కోరుతూ ఉపన్యసించిరి.

అధ్యక్షులు శ్రీ న్యాపతి రామయ్యగారు తమ అధ్యక్షోపన్యాసములో సంఘము స్థాపించిన నాటినుండి నేటివరకు ఎదుర్కొనుచున్న సమస్యలను గూర్చి తెలుపుతూ చేనేత వృత్తి యితోధికంగా అభివృద్ధి చెందవలెననియూ, పద్మశాలీయుల నిరుద్యోగ సమస్యను నివారించుటకుగాను ఇతర కుటీర పరిశ్రమలలోను వృత్తులలోను పాల్గొనవలెననియు కోరిరి. తరువాత శ్రీ ఎస్. స్వామి దాస్ గారు, శ్రీ చెన్న జ్ఞానోత్తగారు, శ్రీమతి దామెర్ల నాగేంద్రమ్మ, శ్రీ యుతులు బి.పి. నరసింహ, టి. లక్ష్మణ్, జి నారాయణస్వామి, అంకితమ్మయ్య, వెన్న కేశవులు గారలు ఉపన్యసించిరి.

ఈ క్రింది తీర్మానములు ఆమోదింపబడినవి:

శ్రీ మతి ఉడుత హేమలతాదేవి గారి మృతిపై సంతాప తీర్మానము శ్రీమతి ప్యాపలి లీలావతమ్మ గారు ప్రతిపాదించిరి. పద్మశాలి సంఘమును ఆంధ్రరాష్ట్ర వెనుకబడినజాతుల మహాసభకు అనుబంధసంస్థగా చేయబడవలయునని తీర్మానమును శ్రీజి.కె. రాజారామ్ గారు ప్రతిపాదించిరి. వెనుకబడినజాతుల విద్యార్థులకు సగం జీతం చేయాలనే తీర్మానమును బడుగుమల్లయ్య గారు ప్రతిపాదించిరి. భక్తి మరియు ఐక్యముపై తీర్మానమును శ్రీ ఆగయ్య గారు ప్రతిపాదించిరి. సికింద్రాబాద్‌నందు పద్మశాలిభవన నిర్మాణముపై తీర్మానమును శ్రీ గోముల స్వామి దాస్ గారు ప్రతిపాదించిరి. పద్మశాలి సంఘ విద్యార్థినిధి కొరకు చేనేత సహకార సంఘమునుకోరు విషయముపై తీర్మానమును శ్రీ జి. కె. రాజారాం ప్రతిపాదించిరి. పద్మశాలి నిధి నెలచందాలు కార్యకర్తనియామకముపై తీర్మానమును శ్రీ తడక నారాయణ గారు ప్రతిపాదించిరి. సంఘము యొక్క ధనముతో చిన్న దుకాణము తెరువాలని తీరానము శ్రీ అడ్లగట్ల నరసయ్యగారు ప్రతిపాదించిరి.

చేనేత ప్రతినిధులకు శాసనసభలోనూ, మంత్రివర్గములోనూ స్థానము కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ శ్రీ బి.పి. నరసింహంగారు తీర్మానమునుప్రతిపాదించిరి.కులసంఘముల ద్వారా కార్యకర్తలయినవారు యీనాడు కుల సంఘములను బహిష్కరించడంమాని తమ కులసంఘములకు సేవచేయవలసిందిగా కోరుతూ తీర్మానము ఆమోదించబడెను.

నియమావళి ఉపసమితివారు సమర్పించిన చిత్తు నియమావళిని పరిశీలించి అవసరమయిన మార్పులతో ఆమోదించుటకు పూర్తి అధికారము నిస్తూ ఒక ఉపసమితి శ్రీ యుతులు ప్యాపలి రామయ్య, జి.కె.రాజారాం, అందె నరసింగరావు, కె.యస్. సత్యనారాయణ బి.ఏ. గారలతో నియమింపబడినది.

నూతన కార్యవర్గము: ఈ క్రింది వారు సికింద్రాబాదు జిల్లా పద్మశాలి సంఘ నూతన కార్యవర్గముగా ఎన్నుకోబడినారు:-

అధ్యక్షులు : ప్యాపలి రామయ్య, ముఖ్య ఉపాధ్యక్షులు : సూరకంటి నాగయ్య, ఉపాధ్యక్షులు : తడక నారాయణ, గుత్తికొండ సత్తయ్య. ప్రధాన కార్యదర్శి : జి కె. రాజారాం. సహాయకార్యదర్శి : అందె నరసింగరావు, కొండబత్తిని శంకరయ్య, వ్యవస్థా కార్యదర్శి : చిటిమిల్ల మల్లయ్య, ప్రచార కార్యదర్శి : ముశం వరదయ్య, కోశాధిపతి : దూసాయాదగిరి. కార్యవర్గసభ్యులు : శ్రీయుతులు కొండ బాలయ్య, దూస వెంకటదాసు, గడ్డమీది ఆగయ్య, శ్రీపతి వెంకటస్వామి, దూస రాజయ్య, నోముల స్వామిదాసు, శ్రీపతి బాల్ రాం, నక్క నరహరి, అడ్లగట్ల నరసయ్య, బొద్దుల సత్తయ్య, చిటిమిల్ల నరసింహులు, సామల నారాయణ, సామల వెంకటయ్య, గాడిపల్లి రాజలింగం, కంది వాసుదేవు, వనమాల పోచయ్య, ఒడుగు మల్లయ్య, ఉద్దెమర్రి రామనాథం, వడ్డెపల్లి సత్త

PHONE No. 4507
కొత్త రకముల వస్త్రముల కొరకు
నీలకంఠం నర్సింలు
సిల్క్ & జనరల్ మర్చెంట్, హైదరాబాద్, ఆ.ప్ర.
N.NARSIMLU CLOTH MERCHANT
SULTANBAZAR, HYDERABAD A.P.
T.MESHAM

ప్రకటన

బాగా మునలివై, దుర్బలమైపోయిన గేదెలు, ఎద్దులు, గుర్రములు వగైరా పశువులు 1958-59 సంవత్సరంలో ప్రయోగాత్మక పరిశీలనకై ఉస్మానియా విశ్వవిద్యాలయమునకు చెందిన పశు వైద్య కళాశాలకు కావలెను.

అట్టి వాటిని సప్లయి చేయదలచిన వారు 'పశువులు సప్లయి చేయుటకు కొటేషన్లు' అని పైన వ్రాయబడిన సీలు వేయబడిన కవరులో టెండరు పంపుకోవలెను. 1958 జూలై 19 వ తేదీన మధ్యాహ్నం 2 గంటల వరకు గానీ, అంతకు ముందుగా గానీ టెండర్లు అందవలెను.

రెండు రూపాయలు చెల్లించి కళాశాల కార్యాలయము నుండి టెండరు ఫారము, షరతులు పొందవచ్చును. ఈ డబ్బు తిరిగి యివ్వబడదు.

యం. అహ్మద్ హుసేన్, ప్రిన్సిపాల్
పశువైద్యకళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

జిందా తిలిస్మాత్

యొక్క నకిలీ ట్రేడ్‌మార్కు కేసు

మోసముచేసిన అనేక రకముల నకిలీ మందులు.

"కార్ఖానా జిందాతిలిస్మాత్" మేనేజింగ్ ప్రొప్రయిటర్ శ్రీ మహమద్ మిన్హాజుద్దీన్ ఫరూఖి నకిలీ మందులు మరియు ట్రేడ్ మార్కు ఫోర్జరీ కేసులను కనిపెట్టి యున్నారు.

జిందా తిలిస్మాత్ యొక్క రిజిస్టర్డు ట్రేడ్‌మార్కు మోసము గురించి గుంటూరు జిల్లా తెనాలి ఫస్టుక్లాసు మెజిస్ట్రేట్ వారి సముఖమున ఐ పి. సి. 486, 488, 480 సెక్షనుల క్రింద 1958 జులై 7 తేదీన కేసు దాఖలు పరచిరి.

జిందా తిలిస్మాత్ రిజిస్టర్డు ట్రేడ్‌మార్కునుసరించి జిందా తిలిస్మాత్ వారి ప్రఖ్యాతిని, మంచి పేరును ఉపయోగించుకొని కొంతమంది నకిలీ మందుల తయారు చేసి, ప్రజలను, వ్యాపారులను మోసముచేసి చేసి నకిలీ మందులు అమ్ముచున్నారని కేసు యొక్క వివరము. అట్టి వారు అశాస్త్రీయమైన ఔషధములచే అక్రమముగా లాభపడుచు ప్రఖ్యాతి నొందిన జిందా తిలిస్మాత్ యొక్క పేరును పాడుచేయుచున్నారు. కార్ఖానా జిందా తిలిస్మాత్ వారు అట్టి మోసగాండ్రను [illegible] వలసినదిగా కేసులోని కథనము [illegible]

గౌరవనీయ మెజిస్ట్రేట్ [illegible] ము విని శ్రీ మహమద్ మిన్హాజుద్దీన్ [illegible] వ్రాసుకొని వెంటనే తెనాలి నర్కోటిక్ డ్రగ్స్ [illegible] నల్ ప్రొసీజర్ కోడ్ 156 మరియు 96 సెక్షనుల క్రింద స్టేట్ [illegible] పేర్కొనబడిన ప్రదేశములలో అకస్మాత్‌గా తనిఖీ చేసి ప్రింటింగ్ మరియు ప్యాకింగ్ వస్తువులతో సహా అన్యాయముగా ఉపయోగించిన ముద్రలు, బ్లాకులను కూడా వశపరచుకోవలసినదిగా ఉత్తరువుల జారీ చేసిరి.

కౌన్సిల్ యొక్క ప్రోద్బలమువల్లము వల్ల వెంటనే ఆర్డరు జారీ చేయుటవల్ల మోసగాండ్రు తమ నకిలీ సరుకును ఖాళీ చేయుటకు సమయము దొరకకుండా కోర్టువారు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మరియు కొంతమంది పోలీసు దళము యొక్క సహాయముతో బంట్రోతులను సారధి ఆర్టు ప్రెస్ తెనాలి వారిపై దాడిచేసి నకిలీ జిందా తిలిస్మాత్ యొక్క 4000 లేబిల్స్ మరియు ప్యాకింగ్ సామాగ్రిని పట్టుకొని స్వాధీనపరచు కొనిరి.

తక్షణము సరియైన చర్య తీసుకోవడముతో తెనాలి పౌరులు బాధనుండి విముక్తులైరి. పోలీసు వారు ఇంకను మోసగాండ్ర కొరకు వెతుకుచునేయున్నారు. పోలీసువారి పరిశోధన పూర్తి అయ్యేటప్పటికి మరికొంతమంది మోసగాండ్రు పట్టుబడి ఎక్కువ వివరములు కనుగొనగలరు.

ఈ రిజిస్టర్డు ట్రేడ్‌మార్కు మోసపు కేసు తెనాలివాసులకుఎంతయో ప్రాముఖ్యము ఉత్సాహము గొల్పెను. ఈ సందర్భమున పాశ్చాత్య ఔషధముల నకిలీని గురించి సమాచారము వచ్చినది. పోలీసు వారు పరిశోధనల రిపోర్టును 1958 జులై 21 తేదీన అందచేయగలరనియు, ఆతేదివరకు కేసు వాయిదా వేయబడి ఉండునని భావించనైనది.

ట్రేడ్‌మార్కు కేసుల నిర్వహించుటలో చతురతగల కౌన్సిల్. శ్రీ రషీద్ సిద్దికి హుస్సేన్, అడ్వొకేట్, ది కార్ఖానా జిందా తిలిస్మాత్ పక్షమున వాదించుచున్నారు.

మేనేజరు

కార్ఖానా జిందాతిలిస్మాత్

నేడు సా॥ 2-30 గం॥ ప్రారంభము

ఎ. ఎల్. యస్. ప్రొడక్షన్స్:

* అంబికాపతి *

(తెలుగు కామెంట్రీతో)

(తెలుగు)

తా॥ భానుమతి, రాజసులోచన, వి. నాగయ్య, శివాజిగణేశన్, ఋష్యేంద్రమణి, టి. ఎ. మధురం, ఎమ్. కె. రాధ.

అలంకార్ - సికింద్రాబాద్.

(Trupix) కర్ణాటక ఫిలిమ్స్ రిలీజ్.

నేడే 3-30 గం॥ నుండి గొప్పవిడుదల

ఉత్తమ సంగీతమయ చిత్రము

ఫిలిమిస్థాన్‌వారి

* తుమ్‌సాసహిదేఖ *

తా॥ పద్మిణీపూర్, అమిత, ప్రాణ్, బి. ఎమ్. వ్యాస్
సంగీతం: ఓ. పి. నయ్యర్

నేడు 3 ఆటలు: 3-30; 6-30; 9-30 గం॥

మినర్వా - సికింద్రాబాదు.

Cima) ఫిల్మిస్థాన్ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల

నేడే బ్రహ్మాండమైన విడుదల

మహత్తర సాహసనృత్యములుగల అపరాధ పరిశోధక చిత్రము.

దీప్-ప్రదీప్ వారి

* పోలీస్ *



తా॥ మధుబాల, ప్రదీప్‌కుమార్, అన్వర్ హుసేన్, దీప్‌ఖోస్లా, నాదిర, ధుమాల్, ఓంప్రకాశ్, భగవాన్. (గెస్టారిస్టు)

దర్శకత్వం:- కాళిదాస్. సంగీతం:- హేమంత్‌కుమార్.
లిరిక్స్: మజ్రూ సుల్తాన్‌పూరి.

ప్రభాత్ - హైద్రాబాద్.

శుక్ర, శని, ఆదివారములు 4 ఆటలు:- 12-30, 3-30, 6-30, 9-30 గం॥
సోమవారమునుండి గురువారము వరకు 3-30 గం॥ ప్రత్యేక మ్యాటినీలు

అజంతా - సికింద్రాబాద్.

శుక్ర, శని, ఆదివారములు 3 ఆటలు:- 3-30, 6-30 మరియు 9-30 గం॥

(Trupix)

కావలెను

1. నల్లగొండ. 2. నిజామాబాద్.
3. ఖమ్మంమెట్టు. 4. కరీంనగరం.
5. మెదక్. 6. ఆదిలాబాద్

జిల్లాల ప్రధాన స్థలముల నుండి వార్తలను పంపుటకు అనుభవము గల విలేఖరులు కావలెను. నియమములను వెంటనే వ్రాయండి.

మేనేజర్

గోలకొండ పత్రిక.

Edited Printed and Published by N. Narotham Reddy M A. for the Golkonda Publications Ltd at the Golkonda Patrika Press Hyderabad(A.P)